Pariksha Prapancham
(The World of Test - Telugu)

# పరీక్షా ప్రపంచం

## (కష్టసుఖాలు-లాభనష్టాలు)

రచన
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సహారా కాంప్లెక్స్
ఫ్లాట్ నెం.**106**, పత్తర్‌గట్టి, హైదరాబాద్ **-2,**
ఫోన్ నెం. **66710795, 9441515414**

వెల........................................................రూ. 20/-లు





| | |
|---|---|
| Name of the Title: | Pariksha Prapancham<br>(The World of Test - Telugu) |
| Compilation : | **ABUL IRFAN**<br>Hyderabad-2 |
| All rights reserved with: | Islamic Resource Centre |
| First Edition: | February, 2009 |
| Copies: | 1000 |
| Published by: | Islamic Resource Centre<br>Sahara Complex, Pathargatti,<br>Hyderabad-2, Ph: 66710795 |
| Type set by: | Alifain, I.R.C. Graphics<br>Sahara Complex, Pathargatti,<br>Hyderabad-500002 |
| Printed at: | Unity Graphics<br>Chatta Bazar,<br>Hyderabad-500002 |
| Price: | Rs. 20/- |

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# పరీక్షా ప్రపంచం
## (కష్టసుఖాలు, లాభనష్టాలు)

వీలయినన్ని ప్రాపంచిక సుఖాలు జుర్రుకోవడమే జీవిత పరమావధిగా భావించిన ప్రతి మనిషీ ధనార్జనలో తలమునకలై పోయాడు. ఎవరిని చూసినా ధనార్జన కోసం ఏదో ఒక పనిలో బిజీగా ఉన్నట్లు కనిపిస్తాడు. ఆ మార్గంలో తగినంత సంపాదించేవాడు మరింత సంపాదిస్తూ విలాసవంత మైన జీవితం గడపడానికి ప్రయత్నిస్తాడు. జీవితం సవ్యంగా, సుఖంగా సాగుతున్నంతకాలం అతనికి సంపాదన తప్ప మరోధ్యాసే ఉండదు.

అయితే ప్రపంచమనే మహాసాగరంలో మానవుని జీవిత నౌక ఎల్లప్పుడూ సాఫీగా సాగిపోతుందన్న గ్యారంటీ ఏమీ లేదు. ఏ క్షణమైనా తుఫానులోనో, సుడిగుండంలోనో చిక్కుకుపోవచ్చు. దాని తాకిడికి నౌక పాక్షికంగా దెబ్బ తినవచ్చు లేదా పూర్తిగా దెబ్బతిని పనికిరాకుండా పోవడమో లేక మునిగి పోయి అంతమైపోవడమో జరగవచ్చు.

అలాంటి విపత్కర పరిస్థితిలోనే మనిషి ధనార్జనధ్యాసకు బ్రేకు పడ్తుంది. అతని సుఖసంతోషాల జీవితం సుడిగాలికి ఎగిరిపోయే బూడిద కుప్పలా మారిపోతుంది. కష్టాల కడగండ్లు విరుచుకుపడతాయి. వాటిని దూరం చేసుకోవడానికి కోటీశ్వరుడైతే లక్షలు ఖర్చు పెడతాడు. సగటు మనిషైతే యావదాస్తిపాస్తులు పోగొట్టు కొని బిక్కమొగం వేసుకుంటాడు. పేదవాడైతే అప్పులు చేసి వడ్డీలాలీతో నడ్డి విరగ్గొట్టించుకుంటాడు.

వారిలో కొందరు కష్టాలు దూరమైపోగానే అదంతా తమ కృషిఫలితమని మిడిసిపడతారు. తమకు తామే పెద్ద ఆపద్బాంధవులని మురిసిపోతారు.



''మురిసిపోకురా ముత్రాసోడా! ముందుంది ముసళ్ళ పండుగ'' అనే విషయాన్ని ఖాతరుచేయకుండా భుజాలు ఎగరేస్తారు.

## కష్టాలలో నిరాశ, సుఖాలలో మిడిసిపాటు!

"మానవుడు చాలా చిత్రమైన మనిషి. మేమతనికి మా అనుగ్రహం చవిచూపిస్తే సంతోషంతో పొంగిపోతాడు. కాని చేజేతులా చేసుకున్న దుష్కార్యమేదైనా ఆపద రూపంలో వచ్చిపడితే (లోగడ దేవుడు చేసిన మేలంతా మరచిపోయి) కృతఘ్నుడైపోతాడు." (ఖుర్ఆన్–42:48)

"మానవుడు ఆపద వచ్చినప్పుడు మమ్మల్ని మొరపెట్టుకుంటాడు. అప్పుడు మేమేదైనా భాగ్యం ప్రసాదిస్తే 'ఇది నాకున్న జ్ఞానం (యోగ్యతల) వల్ల లభించింద'ని అంటాడతను. కాదు, ఇదొక పరీక్ష. కాని చాలామందికి ఈ వాస్తవం తెలియదు." (ఖుర్ఆన్–39:49)

"మానవుడు తన శ్రేయస్సు కోసం ఎంత వేడుకున్నా అలసిపోడు. కాని ఎప్పుడైనా కాస్తంత కష్టం వస్తేచాలు, నిరాశతో క్రుంగిపోతాడు. అయితే మేమతడ్ని ఆ కష్టం నుండి గట్టెక్కించి మా కారుణ్యాన్ని చవిచూపించగానే (మా మేలు మరచి) 'నేనిందుకు అర్హుడ్ని. (నా శక్తిసామర్థ్యాలవల్లనే నాకిది లభించింది) ప్రళయదినం ఒకటుందని, అది తప్పక వస్తుందని నేను భావిం చడంలేదు. ఒకవేళ నన్ను నిజంగానే నాప్రభువు దగ్గరకు తీసికెళ్ళడం జరిగితే అక్కడా నాకు సుఖాలే లభిస్తాయి' అని అంటాడు." (ఖురాన్–41:49,50)

"ఇలాంటి మాటలే పూర్వం కూడా చాలామంది (మూఢులు) అన్నారు. కాని వారు సంపాదించినది వారికి ఏమాత్రం పనికిరాలేదు. చివరికి వారు తమ కర్మల దుష్ఫలితం అనుభవించారు. అలాగే (ఈనాడు) వీరిలోని దుర్మార్గులు కూడా త్వరలోనే తమ కర్మల దుష్ఫలితం అనుభవిస్తారు. వీరు మానుండి ఏవిధంగానూ తప్పించుకోలేరు." (ఖుర్ఆన్–39:50,51)

"ఎప్పుడైనా మేము మానవునికి మా కారుణ్యం చవిచూపిన తరువాత దాన్ని తిరిగి తీసుకుంటే అతను నిరాశచెంది (మాపట్ల) కృతఘ్నుడుగా

మారిపోతాడు. ఒకవేళ అతనికి వచ్చిన ఆపద దూరంచేసి సౌఖ్యం కలిగిస్తే మాత్రం (సంబరపడిపోతూ) 'నా కష్టాలన్నీ తీరిపోయాయి' అంటాడు. పైగా అతను మితిమీరిన సంతోషంతో గర్విష్ఠుడై పోతాడు." (ఖుర్ఆన్–11:9,10)

కొన్ని కష్టాలు ఆస్తులు అమ్ముకున్నా, తల తాకట్టు పెట్టినా తొలగిపోవు. అప్పుడు కొందరు నిరాశానిస్పృహల ఊబిలో కూరుకుపోయి తమ దుర దృష్టాన్ని తలచుకొని క్రుంగిపోతుంటారు. మరికొందరికి దేవుడు గుర్తు కొస్తాడు. వారిలో కొందరు తమ తమ ఇష్ట దైవాలను మొరపెట్టుకుంటారు. ఆ మిథ్యాదైవాల వల్ల కష్టాలు దూరమైపోతే సంతోషంతో గంతులేస్తారు. దూరం కాకపోతే తిరిగి తమ దురదృష్టాన్ని తలచుకొని కుమిలిపోతారు.

"ప్రజలు ఏదైనా కష్టం వచ్చినప్పుడు తమ (నిజ)ప్రభువు వైపు మరలి ఆయన్నే వేడుకుంటారు. కాని ఆయన (ఆ కష్టం దూరంచేసి) తన కారుణ్యాన్ని చవిచూపించగానే వారిలో కొందరు మళ్ళీ బహుదైవారాధనకు పాల్పడతారు. ఇలా మేము చేసిన మేలుకు మాపట్ల (కృతజ్ఞత చూపకుండా) కృతఘ్నులై పోతున్నారు. సరే, కొంతకాలం (ఐహిక)సుఖాలు జుర్రుకోండి. (దీని పర్యవ సానం ఏమిటో) మీకు త్వరలోనే తెలుస్తుంది." (ఖుర్ఆన్–30:33-35)

## కష్టాలు వచ్చినప్పుడే దేవుడు గుర్తుకొస్తాడా?

ఘోరమైన ఆపద విరుచుకుపడినప్పుడు మానవుడు సర్వశక్తిమంతుడైన నిజదేవుడ్నే మొరపెట్టుకుంటాడు. కాని ఆపద తొలగిపోగానే మళ్ళీ మిథ్యా దైవాలనే ఆరాధిస్తాడు. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"సముద్రయానం చేస్తున్నప్పుడు మీకేదైనా ఆపద వస్తే (నిజ)దేవుడు తప్ప మీరు (రోజూ) వేడుకునే మిథ్యాదైవాలన్నీ కనుమరుగైపోతాయి. కాని ఆయన మిమ్మల్ని ఆపద నుండి కాపాడిన తరువాత మీరు ఆయనకు విముఖులై పోతారు. నిజంగా మానవుడు చాలాకృతఘ్నుడు." (17:66,67)

"దేవుడు మిమ్మల్ని (తీరానికి చేర్చిన తర్వాత) భూమిలోకి అణగద్రొక్క డని నిర్భయంగా ఉన్నారా? లేక మీపైకి రాళ్లవర్షంతో కూడిన పెనుతుఫాను



పంపడని నిశ్చింతగా ఉన్నారా? అప్పుడా దుస్థితి నుండి మిమ్మల్ని కాపాడే వారే ఉండరు. దేవుడు మళ్ళీ ఎప్పుడైనా మిమ్మల్ని సముద్రంలోకి తీసికెళ్ళి మీరుచూపిన కృతఘ్నతకు ప్రతీకారంగా మీపైకి భయంకరమైన పెనుగాలులు పంపి మిమ్మల్ని సముద్రంలో ముంచివేయడని నిర్భయంగా ఉన్నారా? అలా జరిగితే మమ్మల్ని ప్రశ్నించేవాడే ఉండడు." (17:68,69)

"ఇంకా ఇలా చెప్పు: 'ఒకవేళ మీపై దేవుని వైపునుండి ఏదైనా ఆపద వచ్చిపడితే లేదా అంతిమఘడియలు సమీపిస్తే మీరు దేవుడ్ని వదలి ఇతరుల్ని వేడుకుంటారా? మీరు సత్యవంతులైతే దీనికి జవాబివ్వండి. అలాంటి విపత్కర స్థితిలో మీరు కల్పించుకున్న మిథ్యాదైవాలన్నిటిని మరచిపోయి నిజదేవుడ్ని మాత్రమే వేడుకుంటారు. ఆయన తలచుకుంటే మీపై వచ్చి పడిన ఆపదను తప్పకుండా దూరంచేస్తాడు." (6:40,41)

మృత్యువు కండ్లముందు తాండవిస్తున్నప్పుడు బహుదైవారాధకులు మిథ్యాదైవాలన్నిటినీ వదిలేసి ఒక్క నిజదేవుడ్ని మాత్రమే వేడుకుంటారు. ఈ యదార్థమే ఇక్కడ ప్రస్తావించబడింది.

మహాప్రవక్త ముహమ్మద్ (స) మక్కా జయించిన తర్వాత అబూజహల్ కొడుకు ఇక్రమా జిద్దాకు పారిపోయి, అక్కడ ఓడెక్కి అబిసీనియా దారి పట్టాడు. అయితే దారిలో తుఫాన్ వచ్చి ఓడ మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రయాణీకులు మొదట్లో తమతమ ఇష్టదేవతల్ని ప్రార్థించారు. కాని తుఫాన్ తగ్గకపోగా మరింత ఉధృతమయింది. దాంతో జనం భయపడి "దేవుడ్ని తప్ప మరెవర్నీ వేడుకునే సమయం కాదిది. ఆయన తలచుకుంటేనే మనం ఈ ఆపద నుండి గట్టెక్కుతాం" అన్నారు.

ఈమాట ఇక్రామాకు కనువిప్పు కలిగించింది. "ఇక్కడ దేవుడు తప్ప మరెవరూ సహాయంచేసేవారు లేరా? మరి ఈ విషయాన్నే కదా ఆ పుణ్యా త్ముడు ఇరవైఏండ్ల నుంచి చెబుతున్నది. మనం అనవసరంగా ఆయనతో పోరాడుతున్నాం" అనుకున్నాడతను. వెంటనే అతను "ఈ తుఫాన్ నుంచి బయటపడితే తాను నేరుగా ముహమ్మద్ (స) దగ్గరికెళ్ళి ఆయన చేతిలో

చేయివేసి కలుపుతాను" అని నిర్ణయించుకున్నాడు. దాని ప్రకారం ఇక్రమా (రజి) దైవప్రవక్త (స) సన్నిధికెళ్ళి ఇస్లాం స్వీకరించారు.

"ముహమ్మద్ (స)! వారిని ఈ విషయం అడుగు: 'మీరు అడవుల్లో, సముద్రాల్లో చిక్కుకున్నప్పుడు ఆ చీకటికూపాల నుండి మిమ్మల్ని కాపాడే దెవరు? (ఆపద సమయంలో) మీరు ఘోరంగా విలపిస్తూ దీనంగా మొర పెట్టుకునేది ఎవరిని? 'ఈ ఆపద నుండి మమ్మల్ని గట్టెక్కిస్తే మేము తప్పకుండా నీకు కృతజ్ఞులై ఉంటామ'ని మీరు ఎవరిని వేడుకుంటారు?' చెప్పు: 'దేవుడే మిమ్మల్ని ప్రతి ఆపద నుండి కాపాడుతున్నాడు. మరి మీరు ఆయనకు ఇతరులను ఎలా సాటికల్పిస్తున్నారు?" (ఖుర్ఆన్-6:63,64)

"వారు పడవ ఎక్కి బయలుదేరినప్పుడు తమ ధర్మాన్ని (నిజ) దేవునికే ప్రత్యేకించి (తమను క్షేమంగా దరికి చేర్చమని) ఆయన్ని ప్రార్థిస్తారు. కాని దేవుడు వారిని క్షేమంగా దరికి చేర్చగానే వారు (మళ్ళీ) బహుదైవారాధనకు పాల్పడతారు. తమను దేవుడు కాపాడి చేసినమేలు మరచి (ఐహిక)సుఖాలు జుర్రుకోవాలి అన్నట్లు కృతఘ్నులైపోతారు. సరే, (దాని పర్యవసానం ఏమిటో) త్వరలోనే వారికి తెలిసొస్తుందిలే." (ఖుర్ఆన్-29:65,66)

"మిమ్మల్ని నేలమీద, నీటిమీద నడిపించేవాడు దేవుడే. మీరు ఓడలలో ఎక్కినప్పుడు చల్లటి వాతావరణం మధ్య ఆ ఓడలు గాలివాటుకు చక్కగా ముందుకు సాగిపోతుంటే మీరు హాయిగా ప్రయాణం చేస్తారు. కొంతదూరం పోయాక హఠాత్తుగా వాతావరణం మారిపోతుంది. గాలి ఉధృతంగా వీస్తుంది. ఓడ నలువైపులనుండి అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ బీభత్సం సృష్టిస్తాయి. దాంతో ప్రయాణీకులు తాము తుఫానులో చిక్కుకున్నామని తెలిసి భయపడి పోతారు. అప్పుడు వారంతా (మిథ్యాదైవాలు మరచిపోయి) ఒక్క దేవుని మీదే విశ్వాసం ఉంచుతూ 'దేవా! నీవు మమ్మల్ని ఈఆపద నుండి గట్టెక్కిస్తే మేము నీపట్ల కృతజ్ఞులైఉంటాం' అని మొరపెట్టుకుంటారు." (ఖుర్ఆన్-10:22)

"అయితే దేవుడు వారిని ఆపద నుండి గట్టెక్కించగానే వారు మళ్ళీ సత్యవిముఖులై ధరణిలో తిరుగుబాటుకు ఒడిగడ్తారు. మానవులారా! (తెలుసు



కోండి) "ఈ తిరుగుబాటువైఖరి వికటించి మీకే వ్యతిరేకంగా పరిణమిస్తుంది. ప్రాపంచిక సుఖాలు కొన్నాళ్ల ముచ్చట మాత్రమే. చివరికి మీరు మా దగ్గరికే రావలసి ఉంటుంది. అప్పుడు మేము మీరు ప్రపంచంలో ఉండగా ఏమేమి చేసుంతదేవారో మీకు తెలియజేస్తాము." (ఖుర్ఆన్-10:23)

"చెప్పు: 'ఆయన తలచుకుంటే మీ మీదికి పైనుండిగాని, లేదా మీకాళ్ళ కిందనుండి గాని శిక్ష రప్పించగలడు. లేదా మిమ్మల్ని విభిన్నవర్గాలుగా చీల్చి ఒకవర్గం శక్తిని మరొక వర్గానికి చవిచూపించగలడు." (ఖుర్ఆన్-6:65)

దేవుడు మానవుల్ని తుఫానులు, భూకంపాలతో పాటు మతకలహాలు, యుద్ధాల ద్వారా కూడా పరీక్షిస్తాడని పైసూక్తి స్పష్టంగా తెలుపుతోంది.

"మానవుడు ఆపద వచ్చినప్పుడు తన ప్రభువుని మొరపెట్టుకుంటాడు. కాని అతని ప్రభువు అతనికి తన అనుగ్రహభాగ్యం ప్రసాదించగానే అతను లోగడ మొరపెట్టుకున్న ఆపద మరచిపోయి ఇతరుల్ని దేవునికి సాటి కల్పిస్తాడు. ఇలా అతను ఇతరుల్ని కూడా దైవమార్గం నుండి తప్పిస్తున్నాడు. 'కొన్నాళ్లు తన అవిశ్వాసవైఖరి ద్వారా ప్రయోజనం పొందమ'ని చెప్పతనికి. చివరికి అతను తప్పక నరకానికి పోవలసిందే." (ఖుర్ఆన్-39:8)

పైసూక్తుల ద్వారా మానవుని కష్టసుఖాలకు మూలకారకుడు సృష్టికర్త, సర్వేశ్వరుడు, సర్వశక్తిమంతుడయిన దేవుడు మాత్రమేనని, మానవులు ఆరాధించే, మొరపెట్టుకునే ఇతర శక్తులన్నీ మిథ్యాదైవాలని స్పష్టంగా తెలుస్తోంది. మరి ఆ నిజదేవుడ్నే నమ్ముకొని ఆయన్నే వేడుకుంటే ఈ కష్టాలు దూరమవుతాయా? ఈ ప్రశ్నకు 'ఆయన తలచుకుంటే మీపై వచ్చిన ఆపదను తప్పక దూరంచేస్తాడ'ని ఖుర్ఆన్ (6:41) చెబుతోంది.

అంటే దేవుడు తలచుకోకపోతే ఏ కష్టాలు, ఆపదలూ దూరం కావన్న మాట. మరి దేవుడు ఎవరి కష్టాలు దూరం కావాలని తలుస్తాడో ఖుర్ఆన్ పేర్కొనలేదు. ఈ ప్రశ్నకు సమాధానం ఏ మతగ్రంథం కూడా స్పష్టం చేయలేదు. కనుక ఈ చిక్కుముడి విప్పడానికి ముందు మన మెదడును ఇలా అనేక ప్రశ్నలు తొలచివేస్తాయి:

## బుద్ధి లేకపోతే సరి!

ఈ సువిశాల విశ్వవ్యవస్థ నిర్వహణ వెనుక ఏదైనా అదృశ్యశక్తి ఉందా లేదా? ఒకవేళ ఉంటే, ఆ అదృశ్యశక్తే దేవుడనుకుంటే ఈ సృష్టినిర్వహణ లో ఆయన ఒక్కడేనా లేక ఆయనతో పాటు మరికొందరు దేవుళ్ళు కూడా ఉన్నారా? ఈ భూప్రపంచంలో మానవుని నిజస్థానం ఏమిటీ? సృష్టికర్తకు, సృష్టిరాసులకు ఉన్న సంబంధంఏమిటీ? ముఖ్యంగా మానవునికి, దేవుని కున్న సంబంధం ఏమిటీ? అసలు దేవుడనే వాడొకడున్నాడా లేడా?

దేవుడు లేడనేవారు కూడా నేటి కలియుగంలో పుట్టుకొచ్చారు. ఒకవేళ ఉన్నాడని వారి అంతరాత్మలు ఘోషిస్తున్నా స్వార్థం వాటి పీకలు నొక్కి వేస్తాయి. ఇలాంటివాళ్ళను నాస్తికులు లేక పదార్థపూజారు అంటారు జనం. వీరిలోనే తమనుతాము 'హేతువాదులు' అని చెప్పుకునే వర్గం కూడా ఒకటుంది. ఈ వర్గంవారు దేవుడుంటే చూపించమని సవాలుచేస్తారు.

ఇక్కడ నాకొక సంఘటన గుర్తుకొచ్చింది. కొన్నేళ్ళ క్రితం కర్నూల్‌లో జరిగిన ఒక మతసమ్మేళనంలో పాల్గొన్నాను. మూడవ ఉపన్యాసకుడు ప్రసంగం ప్రారంభించిన అరగంటకు ఓ కామ్రేడ్ యువకుడు ఆదరా బాదరగా వచ్చాడు. అయిదారు నిమిషాల్లో ఆ ఉపన్యాసకుడి ప్రసంగం ముగిసిపోగానే కన్వీనర్ ప్రకటనతో ఆ యువకుడు లేచి నిలబడ్డాడు. దాదాపు 15 నిమిషాలపాటు మతవ్యతిరేక విషయాలతో సభికుల కను బొమల్ని చిట్లింపజేసి తక్షణమే స్టేజీ దిగి చరచరా వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ఓ క్రైస్తవ మతనాయకుడి ప్రసంగం ప్రారంభమయింది. ఆయన తన ప్రసంగంలో తన స్వానుభవం ఒకదాన్ని ప్రస్తావిస్తూ తనకు ఓనాస్తికుడు తారసపడి 'దేవుడు లేడని, ఉంటే చూపించ'మని అన్నాడట. అప్పుడీ క్రైస్తవ మతనాయకుడు అతనితో 'నీకు బుద్ధి లేదు' అన్నాడట. దాంతో ఆ నాస్తికుడు వళ్ళుమండి 'నాకు బుద్ధి లేదంటావా?' అని అరిచా డట. వెంటనే ఆ క్రైస్తవ నాయకుడు 'ఉంటే చూపించ'మని అడిగాడట. ఈమాట వినగానే ఆ నాస్తికుడు ఖంగు తిన్నాడట.



"ఇబ్రాహీంతో అతని ప్రభువు విషయంలో వాదనకు దిగిన వ్యక్తి గురించి నీవు ఆలోచించావా? దేవుడు అతనికి రాజ్యాధికారం ప్రసాదించాడు. అంచేత అతను (అధికారగర్వంతో దేవుని విషయంలో వాదనకు దిగాడు.)

'ఎవరి అధీనంలో జీవన్మరణాలున్నాయో ఆయనే నాప్రభువు' అని ఇబ్రా హీం(ప్రవక్త) అన్నప్పుడు, 'చావు బ్రతుకులు నా అధీనంలో కూడా ఉన్నాయి' అన్నాడతను. అయితే దేవుడు సూర్యుడ్ని తూర్పునుండి ఉదయింపజేస్తున్నాడు కదా, నీవు అతడ్ని పడమర నుండి ఉదయింపజెయ్యి చూద్దాం' అనడిగాడు ఇబ్రాహీం. దానికా తిరస్కారి సమాధానం ఇవ్వలేక తెల్లమొహం వేశాడు. దేవుడు దుర్మార్గులకు ఎన్నటికీ సన్మార్గంచూపడు." (ఖుర్ఆన్-2:258)

ఖుర్ఆన్‌లోనే మరో సత్యతిరస్కారి వదరిన మాటలు కూడా వినండి:

"(ఈజిప్టు చక్రవర్తి) ఫిరౌన్ (తలబిరుసుతో మాట్లాడుతూ) 'హామాన్ (మంత్రీ)! నాకోసం ఒక ఎత్తయిన గోపురం కట్టించు. నేను (దాని మీదెక్కి) ఆకాశమార్గాలకు చేరుకొని అక్కడ మూసా (ప్రవక్త) ఆరాధించే దేవుడు ఉన్నాడో లేడో తొంగిచూస్తా. నాకైతే ఇతను పచ్చిఅబద్ధాలకోరులా కన్పిస్తు న్నాడు' అని అన్నాడు. ఈవిధంగా ఫిరౌన్‌కు అతని దుష్కార్యాలన్నీ మనోహర మైనవిగా చేయబడ్డాయి. అతడు సన్మార్గం అవలంబించకుండా నిరోధించ బడ్డాడు. ఫిరౌన్ పన్నిన దుష్టపన్నాగాలన్నీ (అతని) వినాశానికే దారితీశాయి." (ఖుర్ఆన్-40:36,37)

రష్యా శాస్త్రవేత్తలు తొలిసారిగా మనిషిని అంతరిక్ష నౌకలో రోదసిలోకి పంపి విజయం సాధించినప్పుడు, ఆ దేశాధ్యక్షుడు కృశ్చేవ్ కూడా దేవుడ్ని గురించి ఇలాగే అన్నాడు. "మేము ఆకాశమంతా తిరిగి చూశాం. మాకు దేవుడు ఎక్కడా కన్పించలేదే!" అన్నాడా పెద్దమనిషి. దీన్నిబట్టి దేవుని విషయంలో మూడువేల సంవత్సరాలకు పూర్వం మార్గభ్రష్టుల మనస్తత్వం ఎలా ఉండేదో నాగరికులం, అభ్యుదయవాదులం అని చెప్పుకునే నేటి వ్యక్తుల మనస్తత్వం కూడా అలాగే ఉందని తెలుస్తోంది. విజ్ఞతావివేచనలు విడనాడినప్పుడు నాగరికత ఎంత పెరిగినా మనస్తత్వం మారదుకదా!

“మనం చనిపోయి, మట్టిలో కలిసి ఎముకల గూడుగా మారాక మళ్ళీ బ్రతికించి లేపబడతామట! అసంభవం. మనకు చేస్తున్న ఈ వాగ్దానం నెర వేరేది కాదు. జీవితమంటే మరేమీ కాదు. ఈ ప్రపంచజీవితమే జీవితం. ఇక్కడే మనం చావాలి, ఇక్కడే బ్రతకాలి మనం (మళ్ళీ బ్రతికించి) లేపబడే ప్రసక్తే లేదు. ఇతను దేవుని పేరుతో అభూతకల్పనలు ప్రచారం చేస్తున్నాడు. కనుక మనం ఇతడ్ని ఎన్నటికీ నమ్మకూడదు.” (ఖుర్ఆన్-23:33-38)

“ఏమిటీ! వీరు సృష్టికర్త లేకుండానే తమంతట తాము తయారయి ఉనికిలోకి వచ్చారా? లేక తమకుతామే సృష్టికర్తలా? పోనీ, భూమ్యాకాశాల్ని సృష్టించారా వీరు? (అదేమీ కాదు.) వీరి కసలు సత్యం మీద నమ్మకమే లేదు. వీరి దగ్గర నీ ప్రభువు నిక్షేపాలేమైనా ఉన్నాయా? లేక వాటి మీద వీరికేమైనా అధికారం ఉందా?” (ఖుర్ఆన్-52:35-37)

“సరే, చనిపోతున్న మనిషి ప్రాణం మీరు కళ్ళారా చూస్తుండగానే అతని కంఠం దాకా వచ్చి, బయటికి పోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు దాన్ని మీరెందుకు ఆపలేరు? మీరు ఎవరి అదుపాజ్ఞలో లేరనుకుంటే ఈపని ఎందుకు చేయలేరు?” (ఖుర్ఆన్-56:83-84)

“భూమ్యాకాశాల్లో ఉన్నవాటిని కళ్ళుతెరచి చూడండని చెప్పు వారికి. సత్యాన్ని విశ్వసించాలన్న ఉద్దేశం లేనివారికి ఎన్ని నిదర్శనాలు చూపినా, ఎన్ని హెచ్చరికలు చేసినా లాభంలేదు. పూర్వం ప్రజలు ఏదుర్దినాలు చూశారో ఆ దుర్దినాల కోసం ఎదురుచూస్తున్నారా వీరు? ‘అయితే ఎదురుచూడండి, నేనూ మీతోపాటు ఎదురుచూస్తాన’ని చెప్పు.” (ఖుర్ఆన్-10:101,102)

“వారికిలా చెప్పు: ‘ప్రపంచంలో తిరిగి చూడండి, ఆయన ప్రాణికోటిని మొదటిసారి ఎలా సృజించాడో అలాగేమళ్ళీ ఆయన వాటినుండి జీవరాసుల్ని పుట్టిస్తున్నాడు. ఆయన ప్రతిపనీ చేయగల సర్వశక్తిమంతుడు. ఆయన తాను తలచిన విధంగా కొందరిని శిక్షిస్తాడు; కొందరిని కరుణిస్తాడు. చివరికి మీరంతా ఆయన వద్దకే పోవలసిఉంది. ఆయన పట్టునుండి భూమండలం లోనూ తప్పించుకోలేరు, ఆకాశంలోనూ తప్పించుకోలేరు. మిమ్మల్ని కాపాడే



ఏ సహాయకుడూ, సంరక్షకుడూ ఉండడు. దేవుని సూక్తుల్ని, ఆయన దర్శన భాగ్యాన్ని నిరాకరించినవారు నా కారుణ్యకటాక్షాల పట్ల నిరాశచెందారు. వారికోసం దుర్భర శిక్ష కాచుకొని ఉంది.” (ఖుర్ఆన్-29:20-23)

“వీరెప్పుడూ ప్రపంచం తిరిగి చూడలేదా? తమకు పూర్వం గతించిన వారికి ఏం గతి పట్టిందో వీరికి తెలియదా? వీరికన్నా వారు ఎంతో శక్తి మంతులు. వారు నేలను బాగా దున్నారు. వీరికంటే వారే భూమిని ఎక్కువ నిర్మాణకార్యాలతో వృద్ధిపరిచారు. వారి దగ్గరకు వారి ప్రవక్తలు స్పష్టమైన నిదర్శనాలు తెచ్చారు. దేవుడు వారికి అన్యాయం చేయలేదు. వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు. చివరికి చెడ్డ పనులకు పాల్పడిన ప్రజలు ఘోరమైన దుష్ఫలితం చవిచూశారు. కారణం వారు దేవుని సూక్తులు తిరస్క రించి వాటిని పరిహసిస్తుండేవారు.” (ఖుర్ఆన్-30:9,10)

## పిడివాదం చేసేవారికి పిడిగుద్దులు తప్పవు

“ఇలా హద్దు మీరిపోయి (సత్యాన్ని) అనుమానిస్తూ ఎలాంటి ఆధారాలు, ప్రమాణాలు లేకుండానే దైవసూక్తుల విషయంలో పిడివాదం చేసే ప్రతి వ్యక్తినీ దేవుడు దారి తప్పిస్తాడు. దేవుని దృష్టిలోనేగాక, విశ్వసించినవారి దృష్టిలో కూడా ఈ వైఖరి చాలా హేయమైనది, అనుచితమైనది. దేవుడు అహంకారం, తలబిరుసుతనాలుగల ప్రతి దుర్మార్గుడి హృదయకవాటాలు మూసివేస్తాడు.” (ఖుర్ఆన్-40:34-35)

పదార్థపూజారులు, ప్రాపంచిక వ్యామోహపరులు తాత్కాలికమైన ఐహిక సుఖాలు లభించే సూచనలు కన్పిస్తే చాలు, ప్రతి దైవేతరశక్తిని ఆరాధించ డానికి పరుగులు పెడ్తారు. ప్రతి కష్టానికి, ప్రతి సుఖానికి మూలకారకుడు దేవుడు మాత్రమే నన్న వాస్తవాన్ని వారు విస్మరిస్తున్నారు.

“ఈ భూమి, ఇందులో ఉన్నదంతా ఎవరిదో చెప్పండి మీకు తెలిస్తే?’ అని అడుగు. వారు ఇవన్నీ దేవునివే అని తప్పకుండా అంటారు. ‘అయితే మీరు స్పృహలోకి ఎందుకు రారు?’ అని అడుగు. (సరే) ‘సప్తాకాశాలకు,

మహోన్నత సింహాసనానికి యజమాని ఎవర'ని అడుగు. వారు దేవుడే అని తప్పకుండా అంటారు. 'అలాంటప్పుడు మీరు (ఆ దేవునికి) ఎందుకు భయ పడర'ని అడుగు." (ఖుర్ఆన్–23:84–87)

"(పోని, ఈ సృష్టివ్యవస్థలో) 'ప్రతి వస్తువుపై పాలనాధికారం ఎవరి కుందో చెప్పండి మీకు తెలిస్తే' అని వారినడుగు. (వారు తప్పక దేవునికే ఉందని చెబుతారు.) అలాగే '(మీకు) ఆశ్రయమిచ్చేవాడు ఒకడున్నాడు; ఆయనకు వ్యతిరేకంగా మరెవరూ (మీకు) ఆశ్రయమివ్వలేరు. అలాంటి శక్తి స్వరూపుడెవరు'అని అడుగు. దేవుడే అని వారు తప్పక అంటారు. 'మరయితే మీరు ఎలా మోసపోతున్నార'ని అడుగు." (ఖుర్ఆన్–23:88,89

"నీవు ఈ భూమ్యాకాశాల్ని ఎవరు సృష్టించారని అడిగితే వారు దేవుడేనని తప్పకుండా అంటారు. వారికిలా చెప్పు: 'సరే, దేవుడు నాకే దయినా కష్టం కలిగించదలిస్తే మీరు దేవుడ్ని కాదని ప్రార్థిస్తున్న మిథ్యా దైవాలు నన్నీ ఆపద నుండి కాపాడగలవా? పోనీ దేవుడు నన్ను కరుణించ దలిస్తే ఈశక్తులు ఆయన కారుణ్యాన్ని అడ్డుకోగలవా? నాకు దేవుడే చాలు. నమ్ముకునే వారు దేవుడ్నే నమ్ముకుంటారు. ఆయన మీదే ఆధారపడతారు." (ఖుర్ఆన్–39:38)

"కష్టాలలో ఉన్నవాడు మొరపెట్టుకుంటున్నప్పుడు అతని మొర ఆలకించే దెవరు? చివరికి అతని కష్టాలు కడతేర్చుతున్నదెవరు? భూలోకంలో మిమ్మల్ని ప్రతినిధిగా చేసిందెవరు? అల్లాహ్‌తో పాటు మరోదేవుడు ఉన్నాడా (ఈ పనులు చేయడానికి)? మీరసలు (ఈ విషయాల్ని గురించి) చాలా తక్కువగా యోచిస్తారు." (ఖుర్ఆన్–27:60–62)

"నేలమీద, సముద్రం మీద కటికచీకటిలో (సయితం) మీకు దారి చూపిస్తున్నదెవరు? ఎవరు తన కారుణ్యానికి (వర్షానికి) ముందుగా శుభవార్త తెచ్చే (చల్లటి) గాలులను పంపిస్తున్నది? అల్లాహ్‌తో పాటు మరో దేవుడు ఉన్నాడా (ఈ పనులు చేయడానికి)? వీరు చేస్తున్న సృష్టిపూజకు అల్లాహ్ ఎంతో అతీతుడు, మహోన్నతుడు." (ఖుర్ఆన్–27:63)



"ప్రాణులను తొలిసారిగా సృజిస్తున్నది, తర్వాత వాటిని పునరుత్పత్తి చేస్తున్నదెవరు? భూమ్యాకాశాల నుండి మీకు ఉపాధి ప్రసాదిస్తున్నదెవరు? అల్లాహ్‌తో పాటు మరో దేవుడు ఉన్నాడా (ఈ పనులు చేయగలిగేవాడు)? వారిని అడుగు 'మీ అభిప్రాయం నిజమైతే వీటికి (తగిన) ఆధారాలేమిటో చూపండి' అని." (ఖుర్ఆన్–27:64); "కనుక మీరు దేవునితో పాటు మరోశక్తిని ఆరాధ్యదైవంగా చేసుకొని పూజించకండి. అలా చేస్తే మీరు నిందితులై, నిస్సహాయులై కూలబడి పోతారు." (ఖుర్ఆన్–17:22)

"ఇలా చెప్పు: వారన్నట్లు దేవునితో పాటు ఇతర దైవాలు కూడా ఉంటే అవి సింహాసనాధీశుని స్థాయికి చేరుకోవడానికి తప్పకుండా ప్రయత్నిస్తాయి. దేవుడు పరిశుద్ధుడు. వారు పలుకుతున్న ఈ పలుకులకు దేవుడు అతీతుడు, ఎంతో ఉన్నతుడు." (ఖుర్ఆన్–17:42,43)

"భూమ్యాకాశాల్లో ఒక్క దేవుడే కాకుండా ఇతర దైవాలు కూడా ఉంటే భూమ్యాకాశాల వ్యవస్థ (ఏనాడో) విచ్ఛిన్నమైఉండేది. వారు కల్పిస్తున్నవాటికి విశ్వసామ్రాజ్య సింహాసనాధీశుడయిన దేవుడు ఎంతో అతీతుడు, పరమ పావనుడు." (ఖుర్ఆన్–21:22)

## జీవిత పరమార్థం

"మేము భూమ్యాకాశాలను, వాటిలో ఉన్నవాటిని ఏదో ఆట (తమాషా) కోసం సృష్టించలేదు. మేమేదైనా ఆటవస్తువును తయారు చేసుకోదలచు కుంటే, ఈ విధంగానే చేయాలనుకుంటే మా దగ్గర ఉన్నవాటితోనే తయారు చేసుకునేవారము. కాని మేము (ఇక్కడ) సత్యం ద్వారా అసత్యంపై దెబ్బ తీస్తున్నాం. ఇలా సత్యం అసత్యం తల పగలగొడ్తుంది. చూస్తుండగానే అసత్యం అంతిమశ్వాస విడుస్తుంది." (ఖుర్ఆన్–21:16–18)

"మేము భూమ్యాకాశాల్ని, వాటి మధ్యఉన్న సమస్తాన్ని ఏదో తమాషా కోసం సృష్టించ లేదు. వాటిని మేము (ఓ మహోన్నత లక్ష్యం కోసం) సత్యం ప్రాతిపదికపై సృజించాం. కాని చాలామందికి (ఈ సత్యం) తెలియదు." (ఖుర్ఆన్–44:38,39)

"ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రతి మనిషికీ అతని సంపాదనకు తగిన ప్రతిఫలం ఇవ్వడానికి దేవుడు భూమ్యాకాశాల్ని సత్యం ప్రాతిపదికపై సృష్టించాడు." (ఖుర్ఆన్–45:22)

"ప్రజలకు ఇహలోక జీవితానికి సంబంధించిన బాహ్యస్వరూపమే తెలుసు. పరలోకం గురించి ఏమరుపాటుకు లోనయి ఉన్నారు. వారు తమ అస్తిత్వాన్ని గురించి ఎన్నడూ యోచించ లేదా? దేవుడు భూమ్యాకాశాల్ని, వాటి మధ్యఉన్న సమస్తాన్ని ఒక నిర్ణీత కాలం కొరకు సత్యబద్ధంగా సృష్టించాడు. కాని చాలామంది తమ ప్రభువును కలుసుకోవలసి ఉందన్న సత్యాన్ని నిరాకరిస్తున్నారు." (ఖుర్ఆన్–30:7,8)

పైసూక్తుల్ని బట్టి దేవుడు ఈ విశ్వవ్యవస్థను ఒక మహోన్నత లక్ష్యం కోసం సృజించాడని తెలుస్తోంది. ఆ లక్ష్యం సత్యం ద్వారా అసత్యాన్ని నిర్మూలించడం అని కూడా పై సూక్తులు తెలియజేస్తున్నాయి. ఆ సత్యాసత్యాలే 'న్యాయం-అన్యాయం' అని (45:22) సూక్తిలో చెప్పబడింది. అంటే అసత్యం, అన్యాయాలను అంతమొందించి సత్యం, న్యాయాలను స్థాపించడమే ఈ సృష్టి వెనుక ఉన్న సృష్టికర్త లక్ష్యమని స్పష్టమవుతోంది.

అయితే ఇంతకూ ఏది సత్యం, ఏది అసత్యం? ఏది న్యాయం, ఏది అన్యాయం? ఈ ప్రశ్నలకు సమాధానం ఈక్రింది సూక్తుల్లో వ్యక్తమౌతోంది:

## మానవులచేత ప్రమాణం

"నీ ప్రభువు ఆదంసంతతి వీపులనుండి వారి భావితరాల్ని తీసి ప్రమాణం చేయించిన సందర్భం. అప్పుడు మేము వారిని సాక్షులుగా పెడుతూ 'నేను మీ ప్రభువుని కానా' అనడిగాం. దానికి వారు 'మీరే మా ప్రభువు. అందుకు మేమే సాక్షులం' అన్నారు. మేమిలా చేయడానికి కారణం, ప్రళయదినాన మీరు 'మాకీ విషయం తెలియద'ని చెప్పవచ్చు. లేదా 'బహుదైవారాధన మాకుపూర్వం మా తాతముత్తాతలు ప్రారంభించారు. మేము ఆతర్వాత వారిసంతతి నుండి పుట్టాము. అలాంటప్పుడు దుర్జనులు చేసిన ఈ తప్పుకు మమ్మల్ని పట్టుకుంటారా?' అని చెప్పవచ్చు." (ఖుర్ఆన్–7:172,173)



సృష్టికర్త, సర్వేశ్వరుడు, సర్వశక్తిమంతుడయిన ఒక్క దేవుణ్ని మాత్రమే విధేయించడం-ఆరాధించడం సత్యం, న్యాయమని పైసూక్తులు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. సంక్షిప్తంగా, సులభగ్రాహ్యంగా చెప్పాలంటే "సృష్టిపూజ జోలికి పోకుండా సృష్టికర్తనే ఆరాధించాలని అర్థం.

సకల చరాచరాలకు సృష్టికర్త, దేవుడు ఒకడున్నాడని, ఆయనే అందరి ప్రభువు, పోషకుడని ప్రతి మానవుని అంతరాత్మ ప్రబోధిస్తుంది. ఈ భావన అతని ఆంతర్యంలో సహజంగానే వేళ్ళూనుకొని ఉంది. దానిక్కారణం మానవుణ్ని సృష్టించే సమయంలోనే దేవుడు ప్రళయం వరకు పుట్టబోయే మానవులందరి ఆత్మలను సమావేశపరచి, ఈ విషయం గురించి వారిచేత ప్రమాణం చేయించడమే. కనుక ఏ మానవుడూ తనకు ఏకదైవారాధనను గురించి తెలియదని; తన తాతముత్తాతల మతాచారాలు, తన చుట్టూ ఉండిన పరిస్థితులు, పరిసరాల ప్రభావంవల్ల తాను దేవుని ఏకత్వాన్ని గుర్తించలేక పోయానని, అంచేత తన మార్గభ్రష్టతకు తాను బాధ్యుణ్ని కానని, దైవన్యాయస్థానంలో చెప్పలేడు.

దౌర్జన్యం, అబద్ధం, వ్యభిచారం, పాపకార్యాలన్న భావన మానవుని నైజంలో ఎలా వేరుగొనిఉందో, బహుదైవారాధన కూడా పాపకార్యమన్న భావన అతని నైజంలో ఉంది. హజ్రత్ ఉబై బిన్ కాబ్ (రజి) దైవప్రవక్త (స) ద్వారా తెలుసుకున్న ఒక విషయాన్ని ఈ విధంగా పేర్కొన్నారు:

'దేవుడు అందర్నీ సమావేశపరచి (ఒక్కొక్క యుగానికి చెందిన)వారిని వేర్వేరువర్గాలుగా చేసి, వారికి రూపం, మాట్లాడే శక్తి ప్రసాదించాడు. తర్వాత వారిచేత ప్రమాణం చేయించాడు. వారిని సాక్షులుగా చేసి 'నేను మీ ప్రభువును కానా?' అని అడిగాడు. దానికి మానవులు 'మీరు తప్పక మా ప్రభువే' అన్నారు. అప్పుడు దేవుడు ఇలా అన్నాడు:

"దీనికి నేను భూమ్యాకాశాల్ని, మీతండ్రి (ఆదం)ని సాక్షులుగా చేస్తున్నాను. రేపు ప్రళయదినాన మాకీ సంగతి తెలియదని చెప్పడానికి మీకు ఆస్కారంలేకుండా ఉండేందుకే (మీచేత నేనీ ప్రమాణం చేయిస్తున్నాను).

గుర్తుంచుకోండి. నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు; నేను తప్ప మరో ప్రభువు, పోషకుడు లేడు; కనుక మీరు ఎట్టి పరిస్థితిలోనూ ఎవరినీ నాకు సాటి కల్పించకూడదు. మీరు నాముందు చేసిన ఈ ప్రమాణాన్ని మీకు జ్ఞాపకం చేయడానికి నేను మీ వద్దకు ప్రవక్తలను, దివ్యగ్రంథాలను పంపిస్తుంటాను." మానవులంతా ఈమాట విని "మేమిందుకు సాక్షులం. మీరే మాప్రభువు, మీరే మా ఆరాధ్యదైవం. మీరుతప్ప మాకు మరో ప్రభువు, ఆరాధ్యదైవం ఎవరూ లేరు' అని అన్నారు."

"నీ ప్రభువు దైవదూతలతో 'భూలోకంలో నేనొక ఖలీఫాని నియమించ బోతున్నాన'ని అన్నాడు." (ఖుర్ఆన్–2:30)

ఇక్కడ ఖలీఫా అనే పదం ప్రపంచంలో మానవుని నిజస్థానం, అతని జీవితలక్ష్యం ఏమిటో తెలియజేస్తోంది. ఈ ప్రపంచంలో మానవుడు దేవుని ప్రతినిధిగా, దేవుడు పంపిన ఆజ్ఞల్ని పాటిస్తూ ఆయనకు పూర్తి విధేయుడై జీవించాలి. జీవితంలోని ప్రతిరంగంలోనూ ఆయన ఆదేశాలను, హితవు లనే పాటించాలి. అంతేగాని, మానవుడు స్వయంగా యజమాని అయి, ఇష్టారాజ్యంగా గడపడానికి వీల్లేదు. ఖలీఫా అనే పదాన్ని మన దేశంలో బ్రిటిష్‌పాలకుల కోసం వాడిన వైస్రాయ్ అనే పదంతో పోల్చవచ్చు.

"మేము దైవదూతల్ని ఆదంకు గౌరవ సూచకంగా అభివాదం చేయమని ఆదేశించినప్పుడు, ఇబ్లీస్ తప్ప అందరూ అభివాదంచేశారు. ఇబ్లీస్ 'నీవు మట్టితో సృజించినవాడికి నేను అభివాదం చేయాల్నా?' అన్నాడు. "కాస్త ఆలోచించు. నీవితనికి నాకంటే ఎక్కువ ఔన్నత్యాన్నిచ్చావు. అంతటి యోగ్యుడా ఇతను? (సరే) ప్రళయందాకా నాక్కాస్త గడువిచ్చావంటే, నేనితని సంతతిని పూర్తిగా దారితప్పించి నా అధీనం చేసుకుంటాను. బహు తక్కువ మంది మాత్రమే నాబారి నుండి బయటపడతారు' అన్నాడతను." (ఖుర్ఆన్–17:61,62)

"దానికి సృష్టికర్త ఇలా అన్నాడు: 'సరే వెళ్ళిపో (ఇక్కడ్నుంచి) నిన్ను, నిన్ను అనుసరించిన వారందరినీ నరకంలో పడవేస్తాను. అదే మీకు తగిన



శాస్తి. వారిలో నీవు ఎవరెవరిని పిలిచి ప్రలోభపెడ్తావో ప్రలోభపెట్టుకో. (కావాలంటే) వారిపై నీ వాహనబలాన్ని, పదాతిదళాన్ని (కూడా) ప్రయోగించుకో. వారి సంతానం, సిరిసంపదల్లో కూడా భాగస్వామిగా చేరిపో. వారిని వాగ్దానాలతో ఊరించి నీ వలలో వేసుకో.' (మానవులారా! గుర్తుంచుకోండి) షైతాన్ చేసే వాగ్దానాలు ఉత్త మోసపు వాగ్దానాలు తప్ప మరేమీ కావు– "ఏమైనప్పటికీ నా ప్రియదాసులపై నీఅధికారం చెల్లదు (నీజిత్తులు పారవు)." నమ్ముకునేవారికి నీ ప్రభువే చాలు. (ఖుర్ఆన్–17:63-65)

"ప్రపంచంలో ఉన్న సమస్తాన్నీ ఆయన మీ ప్రయోజనం కోసమే అదుపులో ఉంచాడు." (ఖుర్ఆన్–22:65)

"మేము ఆదం సంతతికి గౌరవప్రతిష్ఠలు ప్రసాదించాం. వారికి నేలపై, నీటిపై ప్రయాణం చేయడానికి వాహనాలు, తినడానికి పరిశుద్ధమైన ఆహారపదార్థాలు ఇచ్చాం. మేము సృష్టించిన అనేక సృష్టితాలపై వారికి ఎంతో ఆధిక్యత, ఔన్నత్యం ప్రసాదించాం." (ఖుర్ఆన్–17:70)

ఇక్కడ చివరి రెండు పేరాల్లోని సూక్తుల్ని బట్టి మానవుడు యావత్తు సృష్టిరాసుల్లో మహోత్కృష్ట జీవి అని, ఇతర సృష్టిరాసులన్నీ మానవుని సేవ కోసమే సృజించబడ్డాయని తెలుస్తోంది. కనుక మానవుడు సృష్టికర్తకు తప్ప సృష్టిరాసులకు ఎన్నడూ తలవంచకూడదు. మానవుని ఆరాధ్యదైవం సర్వ సృష్టికర్త, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు, ప్రభువు, పాలకుడు, పోషకుడు అయిన అల్లాహ్ మాత్రమే.

ఈ సూక్తులకు ముందు 2:30 సూక్తిలో పేర్కొన్నట్లు మానవుని స్థాయి ఈ ప్రపంచంలో ఖలీఫా (దైవప్రతినిధి). అంటే బ్రిటిష్ ఇండియాలోని వైస్రాయ్ (రాజప్రతినిధి)లా ఇక్కడ మానవుడు దైవప్రతిధిలా పనిచేయ వలసి ఉంటుంది. బ్రిటిష్ ఇండియాలోని వైస్రాయ్‌కు భారత ప్రజలందరిపై ఆధిక్యత, అధికారాలు ఉన్నట్టే దేవుని ధరణిపై ఈ ఖలీఫాకు, అంటే మానవుడికి విశ్వంలోని సకల సృష్టిరాసులపై ఆధిక్యత, అధికారాలు ఉన్నాయని పైసూక్తి (17:70)ని బట్టి తెలుస్తోంది.

అయితే ఈ ఆధిక్యత, అధికారాల విషయంలో మానవుడు దేవుడు నిర్ణయించిన పరిమితులు కట్టుబడివుంటూ వాటిని వినియోగించవలసి ఉంటుంది. బ్రిటిష్ ఇండియాలోని వైస్రాయ్ (రాజప్రతినిధి)లా ఇంగ్లాండ్ చక్రవర్తి నిర్ణయించిన చట్టాలను మాత్రమే భారత దేశంలో అమలు పరుస్తాడు. కాకపోతే రాజప్రతినిధి ఆ రాజచట్టాల వెలుగులో ఉపచట్టాలు నిర్మించుకొని అమలుపరచుకోవచ్చు.

అదేవిధంగా ఈ ప్రపంచంలో మానవుడు దైవప్రతినిధిగా దేవుడు నిర్దేశించిన దైవచట్టాలను మాత్రమే అమలు పరచవలసి ఉంటుంది. అలాగే ఆ చట్టాల వెలుగులో ఉపచట్టాలు నిర్మించుకొని అమలుపరచుకోవచ్చు. అంతేగాని మానవుడు స్వయంగా తన మనసుకు తోచిన చట్టాలు నిర్మించుకొని అమలుపరుస్తూ దైవద్రోహానికి పాల్పడకూడదు. దేవుడు తన శాసనావళికి సంక్షిప్త రూపం ఈవిధంగా ఇచ్చాడు:

"నేను మానవుల్ని, జిన్నుల్ని నన్ను ఆరాధించడానికి తప్ప మరే లక్ష్యం తో పుట్టించలేదు." (ఖుర్ఆన్–51:56)

ఇస్లాంలో 'ఆరాధన' పదానికి చాలా విస్తృతభావం ఉంది. నమాజ్, రోజా, హజ్ లాంటి పూజాపురస్కారాలే కాదు; ఉపాధి సముపార్జన, కుటుంబజీవనం, తోటిమానవులతో సంబంధాలు, వ్యాపారం, ఆర్థికలావాదేవీలు, దేశపాలన, యుద్ధం, ఒడంబడికలు, అంతర్జాతీయ సంబంధాలు సైతం ఆరాధన క్రిందికే వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మానవజీవితంలోని సకల రంగాలకు చెందిన సమస్త వ్యవహారాలు దైవారాధనల క్రిందికే వస్తాయి. కాకపోతే ఇవన్నీ దేవుడు, ఆయనప్రవక్త (స) అందజేసిన ఆదేశాల ప్రకారం నడుచుకున్నప్పుడే దైవారాధనలు అవుతాయి.

ఆరాధనలోని ఈ విస్తృత భావం తెలుసుకుంటే మనిషి జీవితంలోని సమస్త వ్యవహారాల్లో ఎలాంటి అపమార్గం పట్టకుండా ఒక్క విశ్వప్రభువుని మాత్రమే ఆరాధించ గలుగుతాడు. అంటే మనిషి ఖుర్ఆన్, హదీసుల పరిధుల్లో మాత్రమే తన జీవితవ్యవహారాలు సాగించాలన్నమాట.



## మానవుని పుట్టుక-ప్రవృత్తి

"మేము మానవుడ్ని కుళ్ళి ఎండిపోయిన మట్టితో సృజించాము." (దివ్య ఖుర్ఆన్–15:26,27)

"నిరాఘాటంగా సాగుతున్న కాలవాహినిలో మానవునికి తానొక గడ్డిపోచ విలువ కూడా లేనివాడిగా ఉండిన సమయం ఎప్పుడైనా ఎదురైందా? మేము మానవుడ్ని పరీక్షించడానికి ఒక మిశ్రమ బిందువుతో పుట్టించాము. దాని కోసం మేమతడ్ని వినేవాడిగా, చూసేవాడిగా రూపొందించాం. అతనికి మేము సన్మార్గంకూడా చూపించాం. అతను సన్మార్గం అవలంబించి (మాకు) కృతజ్ఞుడైఉన్నా లేక (అవిశ్వాసవైఖరి అవలంబించి) కృతఘ్నుడైపోయినా (అంతా అతని ఇష్టాయిష్టాలపై వదలిపెట్టాము)." (ఖుర్ఆన్–76:1–3)

"మానవుడు (సహజంగానే) బలహీనుడుగా పుట్టాడు. అందువల్ల దేవుడు మీపై ఉన్న ఆంక్షల భారాన్ని తగ్గించదలిచాడు." (ఖుర్ఆన్–4:28)

"నేను (మీ)తండ్రి (ఆదం) సాక్షిగా, అతనికి పుట్టిన సంతానం సాక్షిగా చెబుతున్నాను. మేము మానవుడ్ని (విశృంఖలజీవితం గడపడానికి పుట్టించలేదు.) శ్రమజీవిగా పుట్టించాము. తనపై ఎవరూ అదుపు సాధించలేరని భావిస్తున్నాడా అతను?" ((ఖుర్ఆన్–90:3–5)

"మానవుడు చాలా చిత్రమైన మనిషి. మేమతనికి మా అనుగ్రహం చవిచూపిస్తే సంతోషంతో పొంగిపోతాడు. కాని చేజేతులా చేసుకున్న దుష్కార్యమేదైనా ఆపద రూపంలో వచ్చిపడితే (లోగడ దేవుడు చేసిన మేలంతా మరచిపోయి) కృతఘ్నుడైపోతాడు." (ఖుర్ఆన్–42:48)

"మానవునికి మేమేదైనా భాగ్యం ప్రసాదించినప్పుడు అతను (మిడిసిపడుతూ) ముఖం తిప్పుకొని వెళ్ళిపోతాడు. అదే కాస్తంత కష్టం వస్తే తల్లడిల్లిపోతూ నిరాశచెందుతాడు." (17:83); "మానవుడు సహనం లేనివాడుగా సృజించబడ్డాడు. కాస్త ఆపద వస్తే చాలు, కంగారుపడిపోతాడు. సంపద ఒనగూడినప్పుడు పిసినారితనం వహిస్తాడు." (ఖుర్ఆన్–70:19–21)

మానవునిలో కొన్ని బలహీనతలు (Human weekness) ఉన్నాయనే విషయం వాస్తవమే. అసహనం, తొందరపాటు, ప్రాపంచిక వ్యామోహం, భయప్రలోభాలు, నిరాశానిస్పృహలు మొదలైన బలహీనతలు ఉన్నాయి. అయితే మానవుడు సర్వోత్కృష్టజీవిగా సృజించబడి యావత్తు దైవదూతల చేత కూడా సాష్టాంగప్రమాణం చేయించుకున్నాడు గనక అతను ఈ బలహీనతలను అధికమించవలసి ఉంటుంది. అప్పుడే అతను ఈ ప్రపంచంలో యావత్తు సృష్టిరాసులపై ఆధిక్యత, ఔన్నత్యాలు పొంది నిజమైన దైవదాసుడిగా సృష్టికర్త దృష్టిలో నిలుస్తాడు.

“మేము సృష్టించిన అనేక సృష్టితాలపై వారికి ఎంతో ఆధిక్యత, ఔన్నత్యం ప్రసాదించాం.” (ఖుర్ఆన్–17:70)

## ఐహిక జీవితం-పైపై మెరుగులు

“ఈ ప్రాపంచికజీవితం ఒక ఆట–వినోదం తప్ప మరేమీ కాదు. అసలు జీవితం పరలోక గృహ(జీవిత)మే. ఈ యదార్థం వారు అర్థంచేసుకుంటే ఎంత బాగుండు!” (29:64); “మీకు ఇవ్వబడినదంతా ప్రాపంచిక జీవన సంపద, క్షణికమైన దాని తళుకుబెళుకులు మాత్రమే. దేవుని దగ్గర ఉన్నది ఇంతకంటే ఎంతో శ్రేష్ఠమైనది.” (ఖుర్ఆన్–28:60)

“వినండి, ఐహికజీవితం ఒక ఆట, తమాషా, బాహ్యపటాటోపం, పరస్పరం బడాయి చెప్పుకొని గర్వించడం, సంతానం–సిరిసంపదలలో ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నించడం తప్ప మరేమీకాదు. ఐహిక జీవితాన్నిలా పోల్చవచ్చు: వర్షంతో ఎదిగిన మొలకల్ని చూసి రైతులు సంబర పడిపోతారు. తర్వాత ఆ పొలం పంటకు వచ్చి ఎర్రబారడం కన్పిస్తుంది. ఆ తర్వాత తుప్పగా (గడ్డిపరకలుగా) మారిపోతుంది.” (ఖుర్ఆన్–57:20)

“ఐహికజీవితం, (దానిసౌఖ్యాలు) వట్టి మోసపూరితమైన పైపై మెరుగులు మాత్రమే.” (3:185); “స్త్రీలు–సంతానం, వెండి–బంగారం రాశులు, మేలు జాతి గుర్రాలు, పశుసంపద, సేద్యభూములు (వగైరా) వ్యామోహ వస్తువులు మానవులకు మనోహరమైనవిగా చేయబడ్డాయి. కాని ఇదంతా ఇహలోకంలో



మూన్నాళ్ళ ముచ్చటగా ఇవ్వబడిన జీవనసామగ్రి మాత్రమే. (శాశ్వత సౌఖ్యాలతో కూడిన) శ్రేష్ఠమైన నివాసం దేవుని దగ్గరే లభిస్తుంది.”

“(కనుక) వారికిలా చెప్పు: ‘వీటికంటే ఎంతో శ్రేష్ఠమైన వస్తువులేమిటో మీకు చెప్పనా? భయభక్తులుకలవారి కోసం సెలయేరులు పారే స్వర్గవనాలు సిద్ధంగాఉన్నాయి. అక్కడే వారు శాశ్వతజీవితం గడుపుతారు. అదీగాక, వారికక్కడ ఈడు–జోడు, తోడు–నీడగా పవిత్రసహచరులు కూడాఉంటారు. అన్నిటికన్నా మించి దేవుని ప్రసన్నతా భాగ్యం ప్రాప్తమవుతుంది. దేవుడు తన దాసుల వైఖరిని ఓకంట గమనిస్తున్నాడు.” (ఖుర్ఆన్–3:14,15)

“ప్రాపంచిక జీవితాన్ని ఈవిధంగా పోల్చవచ్చు: ఆకాశం నుండి మేము వర్షం కురిపించినప్పుడు నేల సస్యశ్యామలమై మానవులు, పశువులు తినే పంటలు, పచ్చికలతో కనులపండువుగా తయారవుతుంది. చివరికి పుష్కలమైన పంటలతో పొలాలు శోభిల్లుతాయి. ఆ పొలాలు కోతకు వచ్చినప్పుడు వాటి యజమానులు చూసి ‘ఇక మనకివి ఎంతోలాభం చేకూర్చుతాయి’ అని భావిస్తారు. కాని అంతలో ఓరోజు రాత్రివేళో, పగటివేళో అకస్మాత్తుగా మా ఆజ్ఞ వస్తుంది. మేమా పొలాలను నాశనంచేసి, నిన్న అక్కడ అసలు ఏమీ లేదన్నట్లు పూర్తిగా తుడిచిపెట్టాము. ఇలా మేము యోచించేవారి కోసం మా నిదర్శనాలు విడమరచి తెలియజేస్తున్నాము.” (ఖుర్ఆన్–10:24)

“ప్రవక్తా! మరో తార్కాణంతో వారికి (ఐహిక జీవితం గురించి చెప్పు. ఈరోజు మేము ఆకాశం నుండి వర్షం కురిపిస్తుంటే భూమి సస్యశామలం అవుతుంది. రేపు ఈ చెట్లు, చేమలే నుగ్గునుగ్గయి గాలికి ఎగిరిపోతాయి. దేవునికి అణువణువుపై అధికారముంది. ఈ సంతానం, సిరిసంపదలు ప్రాపంచిక జీవితపు పైపై మెరుగులు మాత్రమే. నీ ప్రభువు దృష్టిలో ఫలితం రీత్యా ఎంతో శ్రేష్ఠమైనవి, శాశ్వతంగా ఉండేవి సత్కార్యాలు మాత్రమే. వాటి ద్వారానే మేలు ఆశించడానికి ఆస్కారం ఉంది.” (ఖుర్ఆన్–18:45-46)

“పరలోకంలో తీవ్రమైన యాతనలు, దేవుని మన్నింపు, ఆయన ప్రసన్నతలు ఉంటాయి. ప్రపంచజీవితం ఒక మాయ, భ్రాంతి తప్ప మరేమీ కాదు.

దేవుడ్ని, ఆయన ప్రవక్తలను విశ్వ సించినవారి కోసం స్వర్గసీమ సిద్ధంగా ఉంది. (కనుక) దేవుని మన్నింపు వైపు, భూమ్యాకాశాలంత విశాలమైన ఆ స్వర్గసీమ వైపు పోటీపడి పరుగెత్తండి. ఇది దేవుని అనుగ్రహం. ఆయన దాన్ని తాను తలచిన వారికి ప్రసాదిస్తాడు. దేవుడు గొప్ప అనుగ్రహశాలి." (57:20,21); "భయభక్తులు కలవారికి పరలోక (స్వర్గ)ధామమే శ్రేష్ఠమైనది. ఆమాత్రం జ్ఞానంలేదా మీకు?" (ఖుర్ఆన్–6:32)

పై పేరాలలో పేర్కొనబడిన దైవసూక్తుల్ని బట్టి ఈ ప్రపంచం మానవునికి ఇవ్వబడిన తాత్కాలిక నివాసం మాత్రమేనని, అతని అసలు నివాసం, శాశ్వత నివాసం పరలోకం అని తెలుస్తోంది. ఆ పరలోకంలో ముఖ్యంగా రెండే రెండు అపార్ట్‌మెంట్లు ఉన్నాయ. ఒకటి- విశ్వాసులు, సజ్జనులైన మానవుల కోసం నిర్మించబడిన సుఖమయ స్వర్గం. రెండు- అవిశ్వాసులు, దుర్జనులైన మానవుల కోసం నిర్మించబడిన దుఃఖమయ నరకం.

ఆ స్వర్గ నరకాల ప్రవేశ నిర్ణయం ఈ ప్రపంచంలో మానవుడు చేసుకునే కర్మల్ని బట్టి ఉంటుంది. అక్కడ సకల భోగభాగ్యాలతో సుఖంగా, శాశ్వతంగా ఉండదలచినవారు జీవితాంతం దేవుడ్ని, ఆయన ప్రవక్తలను విశ్వసించి దేవునిపట్ల భయభక్తులు కలిగివుండాలని పైసూక్తులు (57:20,21; 6:32) తెలియజేస్తున్నాయి. లేకుంటే రెండవ అపార్ట్‌మెంట్‌లో రక్తకన్నీరు కార్చుతూ యుగాల తరబడి నరకయాతనలు అనుభవించవలసిఉంటుంది. ఇదీ అసలువిషయం. ఆమాత్రం జ్ఞానం లేనివారికే ఈ దుర్గతి పడ్తుందని చివరి సూక్తి మనల్ని పరోక్షంగా హెచ్చరిస్తోంది.

## ప్రపంచం ఓ పరీక్షా సదనం

అయితే దేవుడు మానవుడ్ని ఈ ప్రపంచంలోకి ఎందుకు పంపినట్లు? దీనిక్కూడా ఖుర్ఆన్ ఈవిధంగా సమాధానం ఇచ్చింది:

"ఆయనే మిమ్మల్ని ధరణిపై ప్రతినిధులుగా నియమించాడు. మీకు ప్రసాదించినదాని విషయమై మిమ్మల్ని పరీక్షించడానికి ఆయన మీలో కొందరికి కొందరికన్నా ఎక్కువ హోదా–అంతస్తులు ప్రసాదించాడు. నీప్రభువు తప్పక



(నేరస్థుల్ని) కఠినంగా శిక్షిస్తాడు. దాంతోపాటు ఆయన (సజ్జనులపట్ల) గొప్ప క్షమాశీలి, అపార దయామయుడు కూడా." (ఖుర్ఆన్–6:165)

ఈ సూక్తిని బట్టి దేవుడు మానవుడ్ని పరీక్షించడానికే ప్రపంచంలో పుట్టించాడని తెలుస్తోంది. అయితే ఏమిటా పరీక్ష? తనను సృష్టించి పాలిస్తున్న నిజదేవుడ్ని గుర్తిస్తాడా లేదా అన్నదే ఆ పరీక్ష. మానవులు ఈ ప్రపంచంలోకి రాక పూర్వం దేవుడు వారి ఆత్మల చేత చేయించిన ప్రమాణం (7:172,173 సూక్తులు) ప్రకారం ఏకేశ్వరోపాసనా భావన ప్రతి మనిషి అంతఃచేతనలో నిబిడీకృతమై ఉంటుంది. పరిసరాలు, పరిస్థితుల దుష్ప్రభావం వల్ల మానవుడు ఏమరుపాటుకు గురయినప్పుడు ఏకేశ్వరోపాసనా భావన తాత్కాలికంగా మాత్రమే మరుగున పడిపోతుంది. ఏమరుపాటు తొలగిపోగానే తిరిగి ఏకేశ్వరోపాసనాభావన అతని అంతరాత్మ నుండి తొంగిచూస్తూ అప్పుడప్పుడు అతడ్ని హెచ్చరిస్తూఉంటుంది.

అప్పుడు మానవుల్లో బుద్ధి-వివేచనలు గల సహృదయులు, నిస్వార్థపరులు అంతరాత్మప్రబోధనను ఆలకించి ప్రశాంత మనస్సుతో ఆలోచించి రుజుమార్గంలోకి వస్తారు; అజ్ఞానాంధకారం నుండి బయటపడి జ్ఞానకాంతిలోకి అడుగుపెడ్తారు. అలాంటివారే పరమపద సోపానం అధిరోహించి పరాతత్పురుని దిశగా పయనిస్తారు. అలాంటివారే కష్టనష్టాలను, భయప్రలోభాలను ఎదిరించి దైవపరీక్షలో కృతార్థులయ్యే సార్థకజీవులు.

"ప్రజల్లో ఎవరు సత్కార్యాలు చేస్తూ సదాచార సంపన్నులవుతారో పరీక్షించడానికే, మేము సకల వస్తుసామగ్రితో భూమిని శోభాయమానంగా తీర్చిదిద్దాం. చివరికి మేము దాన్నంతటినీ బంజరుభూమిగా మార్చివేస్తాం." (18:7,8); "మీలో ఎవరు మంచిపనులు చేస్తారో (ఎవరు చెడ్డపనులు చేస్తారో) పరీక్షించడానికి ఆయన జీవన్మరణాలు సృష్టించాడు." (67:2)

సృష్టికర్త పెట్టిన పరీక్షలో మనిషి ఏకేశ్వరోపాసన భావనను గుర్తించడంతోపాటు జీవితాంతం సత్కర్మలు కూడా ఆచరించాలని, ఆ మార్గంలోనే ప్రాణాలు సమర్పించాలని పైసూక్తులు బోధిస్తున్నాయి. అందమైన ఈ

ధరణిపై మనిషిని ఆకర్షించే, మనసుని మభ్యపెట్టే ఎన్నో వస్తువులున్నాయి. ఏకదైవారాధకుడు తానెన్నుకున్న రుజుమార్గంలో తనను నిరోధించే ఈ అవరోధాలను తొలిగించుకుంటూ ముందుకు సాగాలి.

“మేము ప్రాపంచికజీవితాన్ని, దాని వైభవం,పటాటోపాలను వారిలో వివిధ ప్రజలకు ఇచ్చాం. నీవు వాటివైపు కన్నెత్తి కూడా చూడకు. వాటిని మేము వారిని పరీక్షించడానికి ఇచ్చాం. నీప్రభువు ప్రసాదించే ధర్మయుక్తమైన ఉపాధి మాత్రమే నాణ్యమైనది, మన్నికైనది.” (ఖుర్ఆన్-20:131)

దేవుడు మానవులందరినీ ఒకే స్థాయిగా పుట్టించలేదు. శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా అనేక వ్యత్యాసాలు ఉంచాడు. కొందరిని తెల్ల వాళ్ళుగా, కొందరిని నల్లవాళ్ళుగా, కొందరిని అందగాళ్ళుగా, కొందరిని అందవిహీనులుగా, కొందరిని బలవంతులుగా, కొందరిని బలహీనులుగా, కొందరిని ఎక్కువ తెలివిగలవారిగా, కొందరిని తక్కువ తెలివిగలవారిగా, కొందరిని ధన వంతులుగా, మరికొందరిని పేదవాళ్ళుగా పుట్టించాడు.

అయితే దేవుడు అందవిహీనుడు అందాన్ని, బలహీనుడు బలాన్ని, పేదవాడు ధనాన్ని కోరుకోవడం తప్పని చెప్పలేదు. అందగాళ్ళను, బలవంతుల్ని, ధనికుల్ని చూసి అసూయ చెందడం; లేనిదాన్ని పొందడానికి అసహజమైన మార్గాల గుండా, అక్రమపద్ధతుల ద్వారా ప్రయత్నించడం మాత్రమే తప్పని చెబుతున్నాడు. అలా జరిగినప్పుడల్లా సమాజంలో అశాంతి అరాచకాలే చెలరేగుతాయి.

“మేము మీలో కొందరికి ఇతరులకన్నా ఎక్కువగా ప్రసాదించినదాన్ని మీరు ఆశించకండి. పురుషులకు వారు సంపాదించుకున్నదానికి తగిన ప్రతిఫలం ఉంది. అలాగే స్త్రీలక్కూడా వారు సంపాదించుకున్నదానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. అయితే మీరు దేవుని అనుగ్రహం వేడుకోండి. నిస్సందేహంగా ఆయన ప్రతివిషయం ఎరిగినవాడు.” (ఖుర్ఆన్-4:32)

దేవుడు మానవుల రూపురేఖలు, శక్తిసామర్థ్యాలు, విద్యాజ్ఞానాలు, స్థితి గతుల ప్రకారమే వారిని పరీక్షిస్తాడు. అంతేగాని యాభై కిలోలు మోయగల్గే



వాడిపై వందకిలోల బరువు మోపడు. కాకపోతే తాను మోపిన బరువును ఎత్తడానికి అతను ఏమేరకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నాడనే విషయాన్ని మాత్రం పరీక్షిస్తాడు.

చిత్తశుద్ధి, దైవభీతి ఉన్నవారు ఈ పరీక్ష నుండి తప్పకుండా గట్టెక్కు తారు. ఆత్మవంచకులే ఈ పరీక్షను ధిక్కరించి పెడదారిలో మెరిసే మేడి పండ్లను ఏరుకుంటూఉంటారు. “మేడిపండు జూడ మేలిమయి ఉండు, పొట్టవిప్పి జూడ పురుగులుండు” అనే వేమన బోధ వీరి చెవులకెక్కవు. అందుకే వీరు మేడిపండును పొట్టవిప్పకుండానే గుటుక్కున మింగేస్తారు. దాని పర్యవసానం పరలోకంలో ఈవిధంగా ఉంటుంది:

“సన్మార్గం ఏమిటో స్పష్టమైపోయినా దైవప్రవక్తను ధిక్కరిస్తూ విశ్వాసులు నడిచే దారి కాదని వేరే (పెడ)దారి పట్టి నడిచేవాడ్ని మేము అతను నడిచే దారినే నడిపిస్తాం. (చివరికి) మేము అతడ్ని నరకంలోకి త్రోసివేస్తాం. అది పరమ చెడ్డస్థలం.” (ఖుర్ఆన్-4:115)

## స్వర్గనరకాలకు పోయే దారులు ఇలా ఉంటాయి

ఇహలోకంలో మనిషిని స్వర్గనరకాలకు చేర్చే దారులు ఎలాఉంటాయో చాలామందికి తెలియదు. స్వర్గానికి పోయే దారి ముండ్లు, మలినాలు, గుంటలు, గతుకులు, విషపురుగులు, క్రూరమృగాలతో అత్యంత ప్రమాద కరంగా ఉంటుంది. నరకానికి పోయే దారి పాలరాతి ఫ్లోరింగ్‌లా నున్నగా, నోరూరించే పండ్లతోటలతో, సువాసనలు గుబాళించే పూదోటలతో, చిరు నవ్వులతో స్వాగతించే సుందరాంగులతో ఎంతో ఆహ్లాదకరంగా, మరెంతో మనోహరంగా ఉంటుంది. వీటిని గురించి ఇస్లాం ఇలా వర్ణించింది:

‘ముస్లిం’ గ్రంథంలో హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు : దేవుడు స్వర్గనరకాలను సృష్టించిన తర్వాత దైవప్రవక్తలకు దైవసందేశం అందజేసే జిబ్రీల్ దూత (అలైహి)ను స్వర్గం వైపు పంపిస్తూ “వెళ్ళు స్వర్గాన్ని, స్వర్గవాసుల కోసం నేను సృష్టించిన అనుగ్రహాలను చూసిరా” అని ఆదేశించాడు. దాని ప్రకారం జిబ్రీల్ (అలై)

వెళ్ళి స్వర్గాన్ని, స్వర్గవాసుల కోసం దేవుడు సృష్టించిన అనుగ్రహాలను చూసివచ్చారు. అప్పుడాయన దేవునితో "నీ గౌరవం సాక్షి! స్వర్గం గురించి వినిన ప్రతివాడూ అందులో ప్రవేశిస్తాడు" అని అన్నారు.

తర్వాత దేవుడు స్వర్గాన్ని కష్టాలతోకూడిన కంచె వేయమని దూతలను ఆదేశించాడు. ఆ తర్వాత ఆయన జిబ్రీల్ (అలై)ని పిలిచి "ఈసారి వెళ్ళి స్వర్గాన్ని, స్వర్గవాసుల కోసం తయారుచేసిన (నా) అనుగ్రహాలను చూసిరా" అని ఆదేశించాడు. దైవదూత జిబ్రీల్ వెళ్ళిచూస్తే అక్కడ స్వర్గం చుట్టు కష్టాలతో కూడిన కంచె వేయబడివుంది. ఆయన తిరిగొచ్చి "దేవా! నీ గౌరవప్రతిష్ఠల సాక్షి! ఇక స్వర్గంలో ఎవరూ ప్రవేశించలేరు' అని అన్నారు.

దేవుడీ మాట విని "సరే ఈసారి నరకం వైపు వెళ్ళి నరకాన్ని, నరకం లోని (నా) శిక్షలు చూసిరా" అని ఆదేశించాడు. దైవాజ్ఞ ప్రకారం జిబ్రీల్ (అలై) నరకం చూసివచ్చి "దేవా! నీ గౌరవప్రతిష్ఠల సాక్షి! నరకం గురించి వినిన ఏ మనిషీ అందులో ససేమిరా ప్రవేశించడు" అని అన్నారు.

ఆ తరువాత దేవుడు "నరకాన్ని సుఖాలు, మనోవాంఛలతో కూడిన కంచె కట్టమని దూతలను ఆదేశించాడు. ఆ పని ముగిసిన తరువాత ఆయన జిబ్రీల్ (అలై)ని పిలిచి "ఈసారి వెళ్ళి నరకాన్ని చూసిరా" అని ఆజ్ఞాపించాడు. జిబ్రీల్ (అలై) వెళ్ళి నరకం చూశారు. తిరిగొచ్చి "దేవా! నీ గౌరవం సాక్షి! ఇప్పుడిక నరకం నుండి ఎవరూ కాపాడుకోలేరు. ప్రతి మనిషీ అందులోకి పోయిపడతాడు" అని అన్నారు. (ముస్లిం)

స్వర్గ, నరకాలకు చేర్చే దారులు ఇహలోకంలో ఎలా ఉంటాయో తెలుసుకొని మీరు ఆశ్చర్యపోయి ఉంటారు. స్వర్గం ఎంత మనోహరంగా ఉంటుందో అక్కడకు గొనిపోయే దారి అంత భయంకరంగా ఉంటుంది. అందుకే "ఉట్టికెక్క లేనమ్మ స్వర్గానికెక్కునా" అన్నారు మన పెద్దలు. అలాగే నరకం ఎంత భయంకరంగా ఉంటుందో అక్కడకు లాకెళ్ళే దారి అంత మనోహరంగా ఉంటుంది. అంటే ఈ ప్రపంచం 'పైన బటారం, లోన లటారం' అన్న మాట. ఈ విషయాన్ని ఖుర్ఆన్ ఇలా చెప్పింది:



"ఐహికజీవితం, (దానిసౌఖ్యాలు) వట్టి మోసపూరితమైన పైపై మెరుగులు మాత్రమే." (3:185); "ఐహిక జీవితాన్నిలా పోల్చవచ్చు: వర్షంతో ఎదిగిన మొలకల్ని చూసి రైతులు సంబరపడిపోతారు. తర్వాత ఆ పొలం పంటకు వచ్చి ఎర్రబారడం కన్పిస్తుంది. ఆ తర్వాత తుప్పగా (గడ్డిపరకలుగా) మారి పోతుంది." (ఖుర్ఆన్-57:20)

ఈ ప్రపంచంలోని ఏ వస్తువూ, ఏ ప్రాణీ శాశ్వతమైనది కాదు. ఇక్కడి ప్రతి వస్తువుకూ, ప్రతి ప్రాణికీ ఒక జీవితకాలమంటూ ఉంది. ఆ జీవిత కాలం ముగిసిపోగానే ఆ వస్తువు లేక ప్రాణి నశించిపోతుంది. కాకపోతే కొన్ని సృష్టిరాసులు వేల సంవత్సరాలు, మరికొన్ని సృష్టిరాసులు వందల సంవత్సరాలు, ఇంకొన్ని సృష్టిరాసులు పదుల సంవత్సరాలు జీవిస్తాయి. అలాగే కొన్ని రోజులు, కొన్ని గంటలు మాత్రమే జీవించి ఉండే సృష్టిరాసులు కూడా ఈ ప్రపంచంలో ఉన్నాయి. మొత్తానికి ఇక్కడున్న ప్రతీదీ నశించి పోయేదే. చివరికి ఈ ప్రపంచానికి కూడా ఒక జీవితకాలం ఉంది. ఆ జీవితకాలం ముగిసిపోగానే ఈ ప్రపంచం కూడా నశించిపోతుంది.

## మూన్నాళ్ళ ముచ్చట

విశ్వవినాశం గురించి విజ్ఞాన శాస్త్రవేత్తలు కూడా తమ పరిశోధనలు వెల్లడించారు. వారి అభిప్రాయం ప్రకారం ఈ విశ్వం మొదట ఏవిధంగా ఉనికిలోకి వచ్చిందో అదే విధంగా నాశనం కూడ అవుతుంది. "పుట్టుట గిట్టుట కొరకే"- "పెరుగుట విరుగుట కొరకే" అనే సామెతలు అందరికీ తెలిసినవే. అందుకే తలపండిన తత్వవేత్తలు ఈ ప్రపంచాన్ని 'క్షణభంగురం, నీటిబుడగ, మూన్నాళ్ళ ముచ్చట' అని అన్నారు.

"ఈ ప్రాపంచిక జీవితం మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. (మానవుల) శాశ్వత నివాసం పరలోకంలో ఉంది." (ఖుర్ఆన్-40:39)

పరలోక జీవితకాలం ముందు ప్రపంచ జీవితకాలం ఎంత స్వల్పమైనదో మనిషి ఊహకే అందదు. పరలోక విషయాలు మానవ మేధస్సుకు అతీత మైనవి. అయితే పరలోక విషయాల్ని గురించి మనిషి ఓ మొద్దు అంచనా

వేసుకొని, వాటి తీవ్రతను కొంతయినా అర్థం చేసుకోడానికి వీలుగా ఖుర్ఆన్, హదీసుల్లో కొన్ని అంకెలున్నాయి. వీటి ఆధారంగా మన ఈ ప్రాపంచికజీవితం ఎంత అశాశ్వతమైనదో అంచనా వేసుకొని కాస్త ఆలోచిద్దాం.

ప్రళయదినాన దేవుడు పాపాత్ముల్ని ఒక చోట చేరుస్తాడు. వారి కళ్ళు నీలిరంగుతో అసహ్యంగా ఉంటాయి. వారిలా మెల్లిగా మాట్లాడుకుంటారు:

"ప్రపంచంలో మనం ఎంత కాలం ఉన్నామని ఒకడంటే, ప్రపంచంలో మనం పదిరోజులు ఉండి ఉంటామని వేరొకడు అంటాడు. కాని వారిలో కాస్త తెలివైనవాడు, మీరు ప్రపంచంలో ఒక్క రోజుకన్నా ఎక్కువ ఉండలేదు" అంటాడు. (ఖుర్ఆన్- 20:103-105 సూక్తులు చూడండి.)

"దేవుడు వారిని ప్రపంచంలో మీరు ఎంతకాలం ఉన్నారో చెప్పండని అడుగుతాడు. దానికి వారు 'ఒక రోజో, ఒక పూటో మేమక్కడ ఉండివుంటాం. లెక్కించేవారిని అడగండి" అని అంటారు. (ఖుర్ఆన్–23:112)

"ఇంతకూ ఆ (ప్రళయ) ఘడియ ఎప్పుడొస్తుంది?" అని అడుగుతున్నారు వారు. దాని సమయం తెలియజేయడానికి నీకేం పని? ఆ విషయం దేవునికి మాత్రమే తెలుసు. నీవు దాన్ని గురించి భయపడేవారిని హెచ్చరించేవాడివి మాత్రమే. వారు దాన్ని (ప్రత్యక్షంగా) చూసినప్పుడు (తాము ప్రపంచంలో) ఉదయమో, సాయంత్రమో ఒక్క పూట మాత్రమే ఉండివుంటాం" అని అనుకుంటారు. (ఖుర్ఆన్–79:42–46)

ప్రళయంనాటి భయానక స్థితి చూసిన తర్వాత మానవునికి ఈ ప్రపంచ జీవితం వాస్తవికత ఏమిటో తెలుస్తుంది. అతని వందేళ్ళ ప్రాపంచిక జీవితం పదిరోజుల కంటే తక్కువ ఉన్నట్లు అన్పిస్తుంది. నిజానికి ప్రాపంచిక జీవితం ఒక్కరోజు కూడా లేదని ఆ పరిస్థితి చూసినవారికి సహజంగానే అన్పిస్తుంది.

**మూడుసెకండ్ల ముచ్చట :** మానవులంతా పునర్జీవింపబడినప్పటి నుంచి కర్మవిచారణ జరిగి, ప్రతిఫలంగా స్వర్గానికి లేక నరకానికి చేరుకునే వరకు సంభవించే ప్రళయదినం 50,000 సంవత్సరాలకు సమానమైన దినమని హదీసుల్లో ఉంది. దీన్నే తీర్పుదినమని, పునరుత్థాన దినమని అంటారు.



దినాన్ని గంటలుగా, నిమిషాలుగా తీసుకుంటే, మానవుడు ప్రపంచంలో వందేళ్ళు జీవించాడనుకుంటే, 50,000 ఏండ్ల సుదీర్ఘ తీర్పుదినం ముందు మానవుని ఈవందేళ్ళ ఐహికజీవితం 2.88 నిమిషాలు మాత్రమే అవుతుంది! అంటే మనం ప్రపంచం అశాశ్వతమైనదనడానికి చెప్పుకునే మూన్నాళ్ళ ముచ్చటంత కూడా ఇది లేదన్నమాట!! అసలు మూన్నాళ్ళ పరిమితే ఎంతో పెద్ద కాలం. ఇక్కడ మూడు నిమిషాల ముచ్చట కూడా లేదు!!!

ఈ 3 నిమిషాల ముచ్చటైనా తీర్పుదినం కాలపరిమితితో పోల్చుకున్నప్పుడే. ఇక కోటానుకోట్ల సంవత్సరాలు గడపవలసిన స్వర్గనరకాల సమక్షంలోనైతే ప్రాపంచిక జీవితం మూడుసెకండ్ల ముచ్చటగా కూడా ఉండదు.

ఒకపూట నమాజు విలువ 2 కోట్ల 88 లక్షల సంవత్సరాల పరలోక అనుభవమన్న భావం స్ఫురింపజేసే హదీసు ఉంది. ఈ లెక్కన ఒకరోజు నమాజుల విలువ 14 కోట్ల, 40 లక్షల సంవత్సరాలు అవుతుంది. దీన్నిబట్టి 100 ఏండ్ల ప్రపంచజీవితం ఎంతో గొప్పజీవితం అనుకుంటే, అది పరలోకంలో 5 లక్షల, 25 వేల, 6 వందల కోట్ల సంవత్సరాలకు సమానమవుతుంది! ఇదేవిధమైన మరోలెక్క ప్రకారం ఆలోచిస్తే 14 కోట్ల, 40 లక్షల ఏండ్లకు సమానమయ్యే ఒక్క పరలోకదినం ముందు మానవుని వందేళ్ళ ఐహిక జీవితం 0.06 సెకండ్లు మాత్రమే అవుతుంది!! అందుకే ప్రపంచం క్షణభంగురం అన్నారు పెద్దలు.

ఇది పరలోక జీవితకాలం సమక్షంలో ప్రపంచ జీవితకాలం గురించిన లెక్క. ఇక పరలోక జీవితం విలువ సమక్షంలో ప్రపంచ జీవితం విలువ ఎంతుందో తెలుసుకుందాం. పరలోక జీవితం ముందు ఇహలోక జీవితానికి అణుమాత్రం విలువ కూడా లేదని ఇస్లాం మనకు తెలియజేస్తోంది.

ఒక హదీసులో దైవప్రవక్త (స) ఈ ప్రపంచానికి దోమ రెక్కంత కూడా విలువలేదని అన్నారు. (బుఖారి); మరో హదీసులో ఇహలోకాన్ని పరలోకంతో పోల్చితే ఇహలోకం సముద్రంలోని ఒక నీటిబొట్టంత కూడా ఉండదని చెప్పడం జరిగింది. (మిష్కాత్ షరీఫ్- 4927/2 చూడండి.)

స్వర్గలోకానికి, ఇహలోకానికి విలువలో ఎంత వ్యత్యాసం ఉంటుందో అది మానవుని ఊహకే అందదు. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ విషయం గురించి చెబుతూ "స్వర్గంలో ఒక కమ్చీ పెట్టుకునేంత చోటైనా సరే, అది ఇహలోకం కంటే, ఇహలోకంలోని సమస్త వస్తుసామగ్రి కంటే ఎన్నో రెట్లు శ్రేష్ఠమైనది" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

## స్వర్గనరకాల తీవ్రతా పరీక్ష

పునరుత్థాన దినాన (Day of Resurrection) స్వర్గ నరకాలలోని సౌఖ్యాలు, యాతనలకు సంబంధించిన తీవ్రత విషయమయి ఒక చిన్న పరీక్ష జరుగుతుంది. అదిలా ఉంటుంది:

క్షణభంగురం లాంటి ఈ ప్రాపంచిక జీవితంలోని కష్టసుఖాలు పరలోకంలోని ఊహాతీతమైన శిక్షలు, సౌఖ్యాల ముందు ఏపాటివీ కావు. ఈ వాస్తవాన్ని మహాప్రవక్త (సల్లం) ఒక హదీసులో ఈవిధంగా తెలిపారు:

"ఇహలోకంలో అత్యధిక సుఖభోగాలు అనుభవించి (అనేక పాపాలతో) నరకార్హుడయిన ఒక వ్యక్తిని ప్రళయదినాన నరకంలో పడేయడం జరుగుతుంది. నరకజ్వాల్లో అతని దేహం దహించుకుపోయి ఆ రంగును పరిగ్రహించినప్పుడు దేవుడు అతనితో "ఆదం పుత్రుడా! నీవు ఎప్పుడైనా మంచిరోజులు చూశావా? సుఖాన్ని, భోగభాగ్యాలను ఒక్క సారైనా అనుభవించావా?" అని అడుగుతాడు. దానికతను "లేదు ప్రభో! నీ సాక్షిగా, ఎన్నడూ లేదు" అనంటాడు.

అలాగే ఇహలోకంలో దుర్భర దారిద్ర్యం అనుభవించిన స్వర్గార్హుడయిన ఒక మనిషిని తెచ్చి స్వర్గంలో ప్రవేశింపజేస్తారు. అతనికి స్వర్గసుఖాల రంగు బాగా ఎక్కి అతను వాటిలో తేలియాడుతున్నప్పుడు దేవుడు అతనితో "ఆదం పుత్రుడా! నీవు ఎప్పుడైనా పేదరికాన్ని చవిచూశావా? కష్టాలను, ఇబ్బందుల్ని ఎప్పుడైనా ఎదుర్కొన్నావా?" అని అడుగుతాడు. దానికి ఆ స్వర్గవాసి "లేదు ప్రభూ! నేను ఏనాడూ లేమిని ఎరగను. ఏ కష్టాన్నీ అనుభవించలేదు" అనంటాడు. (ముస్లిం)



అంటే నరకవాసి ఇహలోకంలో ఎలాంటి భోగభాగ్యాలలో తులతూగినా, నరకంలో దాపురించే ఓ క్షణం బాధకే ప్రాపంచిక సుఖాలన్నిటినీ మరచిపోతాడు. అలాగే స్వర్గవాసి ఇహలోకంలో ఎన్ని కష్టనష్టాలకు గురయినా స్వర్గంలో ఓ లిప్తకాలం పాటు పొందే ఆహ్లాదకరమయిన మారుతానికే ప్రాపంచిక కష్టాలన్నీ మరచిపోతాడన్న మాట.

ప్రపంచంలో మానవునికి ఈ జీవితం కేవలం పరీక్ష కోసమే ఇవ్వబడింది. అతనిక్కడ దేవుని ఆదేశాలు శిరసావహిస్తూ దైవప్రవక్తల బోధనల ప్రకారం పవిత్రజీవితం గడుపుతాడా లేక తనకివ్వబడిన స్వేచ్ఛను, సమయాన్ని దుర్వినియోగం చేస్తూ మార్గభ్రష్టుడయిపోతాడా అన్నదే ఈ పరీక్ష.

పరీక్షహాల్లో విజ్ఞతా వివేచనలు గల విద్యార్థి సమయాన్ని ఏమాత్రం వృధా చేయకుండా ప్రశ్నపత్రం పైనే తన దృష్టినంతటినీ కేంద్రీకరించి వాటికి సమాధానాలు రాయడంలో లీనమయిపోతాడు. అలాగే ఈ ప్రపంచాన్ని పరీక్షా స్థలంగా భావించి అనుక్షణం దైవాజ్ఞలకు అనుగుణమైన జీవితం గడపాలని ఇస్లాం చెబుతోంది. ఇలా దైవాజ్ఞలకు అనుగుణమైన జీవితం గడపడం వల్ల పరలోకంలో స్వర్గంరూపేణ మహోన్నత సాఫల్యం లభించడమేగాక, ప్రపంచంలోనూ మనిషి శాంతీసుఖాలతో సంతృప్తికరమైన జీవితం గడపగలడని ఇస్లాం మనకు హామీ ఇస్తోంది.

ఒకవేళ ఎవరైనా దైవధర్మాన్ని త్రోసిపుచ్చి ప్రపంచంలోనే వీలైనన్ని సుఖాలు అనుభవించాలన్న ఉద్దేశ్యంతో పాటుపడితే దేవుడు అతని కోరికను ప్రపంచంలోనే నెరవేరుస్తాడు. అంతేగాని అతడ్ని వెంటనే శిక్షించడు. ప్రపంచం పరీక్షా సదనం కదా మరి! అసలు ప్రతిఫలం పరలోకంలోనే లభిస్తుంది. ఖుర్‌ఆన్‌లోని ఈసూక్తులు చూడండి:

"(కనుక క్షణభంగురం లాంటి ఈ ఐహిక జీవితంలోని పైపై మెరుగులకు మోసపోకండి.) దేవుడు మిమ్మల్ని (స్వర్గమనే) శాంతినిలయం వైపు పిలుస్తున్నాడు. ఆయన తాను కోరినవారికి సన్మార్గం చూపుతాడు. సత్కార్యాలు చేసేవారికి సత్ఫలం ఉంది, అంతకుమించి కూడా ఉంది." (10:25)

"కేవలం ప్రాపంచిక ప్రతిఫలాపేక్షతో పనిచేసే వారికి మేము ప్రపంచం లోనే వారి ప్రతిఫలం ఇచ్చివేస్తాం. పరలోక ప్రతిఫలాపేక్షతో పనిచేసేవారికి పరలోకంలో వారికి రావలసిన ప్రతిఫలం అనుగ్రహిస్తాం. కృతజ్ఞులైవుండే వారికి మేము తప్పక తగిన బహుమానం ప్రసాదిస్తాం."(3:145); "కేవలం ఐహిక ప్రతిఫలం కోరుకునేవాడు, దేవుని దగ్గర ఐహిక ప్రతిఫలంతో పాటు పరలోక ప్రతిఫలం కూడా ఉందని తెలుసుకోవాలి." (ఖుర్ఆన్-4:134)

"కేవలం ప్రాపంచిక జీవితాన్ని, దాని తళుకుబెళుకుల్ని కోరుకునేవారికి వారి కర్మఫలాన్ని పూర్తిగా ఇక్కడే ఇచ్చివేస్తాం. అందులో వారికి ఎలాంటి కొరత చేయం. అయితే పరలోకంలో అలాంటివారికి నరకాగ్ని తప్ప మరేమీ ఉండదు. వారు ప్రపంచంలో సమకూర్చుకున్నదంతా నిరర్థకమైపోయింది. వారు చేసినదంతా మిథ్యే." (ఖుర్ఆన్-11:15,16)

"మేము వారికి కొంతకాలం సుఖాలు అనుభవించే అవకాశమిస్తున్నాం. ఆతర్వాత వారిని నిస్సహా యులుగా చేసి ఘోరమైన యాతన వైపు ఈడుస్తాం." (ఖుర్ఆన్-31:24)

పదార్థపూజారుల, ప్రాపంచిక వ్యామోహపరుల దృష్టి ఎల్లప్పుడూ ఐహిక సౌఖ్యాల పైనే ఉంటుంది. ఆ దృష్టితోనే వారు తమకు దక్కవలసిన సౌఖ్యాలు ప్రపంచంలోనే ప్రసాదించమని దేవుడ్ని వేడుకుంటారు. ఇలాంటి జనం ప్రాపంచిక ప్రయోజనాల కోసం మిథ్యాదైవాల్ని కూడా ప్రార్థిస్తారు.

కొందరు ప్రజలు దేవుడ్ని ప్రార్థిస్తూ "ప్రభూ! మాకు (నీవు ప్రసాదించే వన్నీ) ప్రపంచంలోనే ప్రసాదించు" అంటారు. అలాంటివారికి (ప్రపంచం లోనే తప్ప) పరలోక(స్వర్గ)ంలో ఎలాంటి వాటా లభించదు. మరికొంద రున్నారు. వారు "ప్రభూ! మాకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరకయాతనల నుండి రక్షించు" అని వేడు కుంటారు. ఇలాంటివారికి వారి సంపాదనను బట్టి (ఉభయలోకాల్లోనూ) తగిన వాటా (ప్రతిఫలం) లభిస్తుంది. దేవుడు త్వరలోనే (కర్మల) లెక్క తీసుకుంటాడు. (ఖుర్ఆన్-3:200-202)



## స్వేచ్ఛ అంటే ఇష్టారాజ్యం కాదు

పరీక్ష కోసం మానవుడికి స్వేచ్ఛ కూడా అవసరమే. స్వేచ్ఛలేని పరీక్ష పరీక్ష అన్పించుకోదు. అయితే ఆ స్వేచ్ఛ విశృంఖుల స్వేచ్ఛగా మారితే మాత్రం మానవుడు ప్రమాదంలో పడిపోయినట్లే.

"నిరాఘాటంగా సాగుతున్న కాలవాహినిలో మానవునికి తానొక గడ్డిపోచ విలువ కూడా లేనివాడిగా ఉండిన సమయం ఎప్పుడైనా ఎదురైందా? మేము మానవుడ్ని పరీక్షించడానికి ఒక మిశ్రమబిందువు ద్వారా పుట్టించాము. దానికోసం మేమతడ్ని వినేవాడిగా, చూసేవాడిగా చేశాం. అతనికి మేము సన్మార్గంకూడా చూపించాం. అతను సన్మార్గం అవలంబించి (మాపట్ల) కృతజ్ఞుడైఉన్నా లేక (అవిశ్వాస వైఖరి అవలంబించి) కృతఘ్నుడైపోయినా (అంతా అతని ఇష్టాయిష్టా లపై వదిలేశాము)." (ఖుర్ఆన్-76:1-3)

ఇహలోకం ఎవరికెలాంటి స్థానమో దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఈ ప్రపంచం విశ్వాసిపాలిట జైలు; అవిశ్వాసి పాలిట స్వర్గం." (మిష్కాత్)

అయితే దేవుడు మానవుడ్ని పరీక్షించడంలో అతనిపై అతని శక్తికి మించిన భారం వేయడు. ఎవరికి ఏ మేరకు శక్తి స్తోమతలు ఉంటాయో ఆ మేరకే వారిని పరీక్షిస్తాడు. ఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తి చూడండి:

"మేము ఏ మనిషి పైనా అతని శక్తికి మించిన భారం వేయము. మా దగ్గర ఓ గ్రంథం ఉంది. అందులో వాస్తవిక విషయాలన్నీ ఉన్నాయి. కనుక ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు." (23:62)

మానవుడు ఈ ప్రపంచంలో అడుగడుగునా పరీక్షించబడుతున్నాడు. అతని జీవితంలోని ప్రతిరంగంలోనూ పరీక్షే. జీవితాంతం ప్రతి క్షణం, ప్రతి చోటా పరీక్ష దశలను దాటుకుంటూ పయనించవలసిందే. విశ్వప్రభువు ఇక్కడ మనకు ప్రశ్నలే గాకుండా వాటి సమాధానాలు కూడా (ఖుర్ఆన్, హదీసుల రూపంలో) ఇచ్చాడు. కనుక వాటిని మన క్రియాజీవితంలో ఎత్తి రాసుకోవడమే మన పని.

ఈలోకంలో ఎవరైనా వందేళ్ళు జీవిస్తాడనుకుంటే, దాన్ని నందనవనంగా తీర్చి సుఖంగా జీవించదలచిన మనిషి ఆ వందేళ్ళలో దాదాపు పాతికేళ్ళు విద్యార్జన కోసమే శ్రమపడతాడు. అంటే అతను తన మొత్తం జీవితకాలంలో 25 శాతం కాలం శ్రమిస్తాడన్న మాట. కాని పరలోకంలోని ఒక రోజుకు సమానమైన 14కోట్ల, 40లక్షల సంవత్సరాల కాలంతో పోల్చుకుంటే ఈ వందేళ్ళ ప్రపంచజీవితంలోని మన శ్రమంతా అందులో సమయ శాతం 0.0000007 మాత్రమే! అంటే ప్రపంచమనే ఈ పరీక్షాస్థలంలో ప్రశ్నలకు జవాబులు ఎత్తి రాసుకోవడానికి పడే శ్రమ బహుస్వల్పం అన్న మాట.

మానవుల పరీక్ష గురించి బుఖారీ గ్రంథంలో ఒక ఉదాహరణ ఉంది. ఆ హదీసులో దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలియజేశారు:

## ముగ్గురు వ్యక్తుల పరీక్ష

(పూర్వం) ఇస్రాయీల్‌సంతతి ప్రజలలో ముగ్గురు వ్యక్తులు ఉండేవారు. వారిలో ఒకడు కుష్ఠురోగి, మరొకడు అంధుడు, వేరొకడు బట్టతలవాడు. దేవుడు ఆ ముగ్గుర్ని పరీక్షించదలచి ఒక దైవదూతను (మానవాకారంలో) వారి దగ్గరకు పంపించాడు.

దైవదూత వచ్చి మొదట కుష్ఠురోగితో "నీకు ఏ రంగంటే ఇష్టం?" అని అడిగాడు. దానికతను "అందమైన రంగు, మంచి దేహమంటే ఇష్టం. నాఈ పరిస్థితి చూసి జనం నన్ను అసహ్యించుకుంటున్నారు" అని అన్నాడు. దైవదూత ఈ మాట విని అతని శరీరాన్ని స్పృశించాడు. అప్పుడు దేవుడు ఆ వ్యక్తికి ఆరోగ్యం చేకూర్చి అందమైన రంగు ప్రసాదించాడు. తరువాత దైవదూత "సంపదలలో నీకు ఏ సంపదంటే ఇష్టం?" అని అడిగాడు. "నాకు ఒంటెలంటే ఇష్టం" అన్నాడతను. దైవదూత అతనికి ఒక సూడిఒంటె ఇచ్చి "ఇందులో నీకు చాలా శుభం కలుగుతుంది" అన్నాడు.

తరువాత దైవదూత అంధుడి దగ్గరకు పోయి "నీకు ఏ విషయం అంటే ఇష్టం?" అని అడిగాడు. దానికా అంధుడు "దేవుడు నాకు నా



చూపును తిరిగి ఇచ్చివేస్తే చాలు" అన్నాడు. దైవదూత చేత్తో అతని కళ్ళను స్పృశించాడు. అప్పుడు దేవుడు ఆ అంధుడికి చూపు ప్రసాదించాడు. తర్వాత దైవదూత అతడ్ని "సంపదలలో నీకు ఏ సంపదంటే ఇష్టం?" అనడిగాడు. "మేకలంటే ఇష్టం" అన్నాడతను. దైవదూత అతనికి ఒక సూడి మేకను ఇచ్చి "దేవుడు నీకు ఇందులో శుభం చేకూర్చుతాడు" అన్నాడు.

దైవదూత అక్కడ్నుంచి బట్టతలవాడి దగ్గరకెళ్ళి "నీకు ఏ విషయం ఇష్టం?" అని అడిగాడు. దానికా వ్యక్తి "నా బట్టతల చూసి జనం నన్ను ఈసడించుకుంటున్నారు. నాతల మీద వెంట్రుకలు వచ్చేలా చేస్తే చాలు" అన్నాడు. దైవదూత అతని తలపై చేయి తిప్పాడు. దాంతో అతని బట్టతలపై వెంట్రుకలు వచ్చేశాయి. తరువాత దైవదూత అతడ్ని "నీకు ఏ సంపదంటే ఇష్టం?" అని అడిగాడు. "ఆవులంటే ఇష్టం" అన్నాడతను. దైవదూత అతనికి ఒక సూడి ఆవునిచ్చి "ఇందులో నీకు శుభం కల్గుతుంది" అన్నాడు.

దైవదూత ఈమాట చెప్పి వెళ్ళిపోయాడు. కొంతకాలానికి ఆ ముగ్గురికి ఇచ్చిన పశువులు పిల్లలు పెట్టడం మొదలెట్టాయి. ఒంటె తీసుకున్నవాడికి పెద్ద ఒంటెలమంద, ఆవు తీసుకున్నవాడికి పెద్ద ఆవులమంద, మేక తీసు కున్నవాడికి పెద్ద మేకలమంద తయారయ్యాయి. కొంత కాలానికి దైవదూత గతరూపంలోనే బాటసారిగా ఆ ముగ్గురి దగ్గరకు బయలుదేరాడు.

దైవదూత మొదట కుష్ఠురోగి దగ్గరకు పోయి "అయ్యా! నేనొక బాటసారిని. నా ప్రయాణ ఒనరులన్నీ పోయాయి. నా స్వస్థలానికి చేరుకోవ డానికి నాకిక దేవుడే దిక్కు. దేవుడు మీకు మంచి వర్ణం, పశుసంపద ప్రసాదించాడు. నేను మిమ్మల్ని ఆ దేవుని (ప్రసన్నత) కోసం నాకొక ఒంటెను దానం చేయమని అర్థిస్తున్నాను. మీరు ఒంటె ఇస్తే నేను నా స్వస్థలానికి నిశ్చింతగా చేరుకుంటాను" అని అన్నాడు.

దానికా వ్యక్తి "ఈవిధంగా వేలాది మంది ఉన్నారు. నేనెంత మందికని దానం చేయను?" అన్నాడు. దైవదూత ఈమాట విని "నేను మిమ్మల్ని బహుశా గుర్తు పట్టాననుకుంటా. మీరు ఒకప్పుడు కుష్ఠురోగిగా ఉండేవారు.

తరువాత దేవుడు మీకు మంచి వర్ణం, పెద్ద ఎత్తున ఈ పశుసంపద ప్రసాదించాడు, ఔను కదూ?" అని అడిగాడు. దానికా మనిషి దైవదూత మాటలు ఖండిస్తూ "కాదు. ఈ పశుసంపద మాకు తరతరాల నుంచి వస్తున్న సంపద" అని అన్నాడు. అప్పుడు దైవదూత "నువ్వు గనక అబద్ధ మాడుతున్నట్లయితే దేవుడు నిన్ను గతంలో నీవు ఎలా ఉండేవాడివో అలా చేయుగాక!" అని శపించాడు.

ఆ తర్వాత దైవదూత బట్టతలవాడి దగ్గరకు పోయి, అతనితో కూడా ఇలాగే మాట్లాడి ఒక ఆవు దానం చేయమని అడిగాడు. అతను కూడా కుష్ఠురోగి లాగే సమాధానమిచ్చాడు. అంచేత దైవదూత అతడ్ని కూడా శపిస్తూ "నువ్వు గనక అబద్ధమాడుతున్నట్లయితే దేవుడు నిన్ను గతంలో నీవు ఎలా ఉండేవాడివో అలా చేయుగాక!" అని అన్నాడు.

దైవదూత అక్కడ్నుంచి బయలుదేరి అంధుడి దగ్గరకు చేరుకున్నాడు. అతనితో మాట్లాడుతూ "అయ్యా! నేనొక పేద బాటసారిని. నా ప్రయాణ ఒనరులన్నీ పోయాయి. నాకిక దేవుడే దిక్కు. ఆ దేవుడు మీకు చూపు తిరిగిచ్చి ఈ పశుసంపద ప్రసాదించాడు. ఆ దేవుని (ప్రసన్నత) కోసం నాకొక మేక దానం చేయమని మిమ్మల్ని అర్థిస్తున్నాను. మేకను ఇస్తే నేను నా స్వస్థలానికి నిశ్చింతగా చేరుకుంటాను" అని అన్నాడు.

దానికి అంధుడు ఇలా అన్నాడు: "నిజమే. నేను పూర్వం అంధుడ్నే. అందులో ఎలాంటి సందేహం లేదు. తరువాత దేవుడు నాకు దృష్టి ప్రసాదించాడు. నేను గతంలో చాలా పేదవాడ్నే. తరువాత దేవుడు నాకు ఈ పశుసంపద ప్రసాదించాడు. అంతా ఆయన దయే. నీవు కోరుకున్నన్ని మేకలు తీసుకో. నాకెలాంటి అభ్యంతరం లేదు."

దైవదూత ఈ మాటలు విని "నీ మేకలు నాకవసరం లేదు. దేవుడు నన్ను మీ ముగ్గుర్ని పరీక్షించడానికి పంపాడు. దేవుడు ఇప్పుడు నీపట్ల ప్రసన్నుడయ్యాడు. నీ మిత్రులిద్దరి పట్ల అప్రసన్నుడయ్యాడు" అంటూ అసలు విషయం తెలియజేశాడు.



## స్వార్థపరులకు సత్యం పచ్చి వెలక్కాయే

ప్రపంచం మానవులకు పరీక్షాసదనం కనుక పరీక్షకాలం ముగిసిపోగానే ఫలితాలు అనుభవించే అసలుజీవితం మొదలవుతుంది. మానవుడు చేసే ఘోరమైన పాపాలకు, లేక అత్యున్నతమైన పుణ్యకార్యాలకు తగినఫలం అనుభవించడానికి ఈ ప్రపంచం సరైన వేదిక కాదు. దాని కోసం పరలోకమే తగిన వేదిక. అయితే ప్రాపంచిక వ్యామోహపరులు తమ స్వార్థాన్ని వదలు కోలేక పరలోకజీవితాన్ని ఎల్లప్పుడూ తిరస్కరిస్తూనే వచ్చారు.

"ఇతను (దైవప్రవక్త) మీలాంటి మానవుడే తప్ప మరేమీ కాదు. మీరు తినేది, త్రాగేదే ఇతనూ తింటున్నాడు, త్రాగుతున్నాడు. అలాంటి ఒక మానవ మాత్రుడికి విధేయులయిపోతే మీరు చాలా నష్టపోతారు. మనం చనిపోయి, మట్టిలో కలసి ఎముకలగూడుగా మారాక మళ్ళీ బ్రతికించి లేపబడతామట! అసంభవం. మనకు చేస్తున్న ఈ వాగ్దానం నెరవేరేది కాదు. జీవితం అంటే మరేమీ కాదు. ఈ ప్రపంచ జీవితమే. ఇక్కడే మనం బ్రతకాలి. ఇక్కడే చావాలి. మనం (మళ్ళీ బ్రతికించి) లేపబడే ప్రసక్తే లేదు." (ఖుర్ఆన్–23:33–38)

"కాని ఈ విషయం గురించి వారు ఏమరుపాటులో పడిపోయారు. అందువల్ల వారి ఆచరణ కూడా దీనికి భిన్నంగా ఉంది. మేము వారిలో భోగభాగ్యాల్లో మునిగి తేలుతున్నవారిని పట్టుకునేదాకా వారు (దారికి రాకుండా) ఆ పనులే చేస్తుంటారు. చివరికి మాకు పట్టుబడగానే వారు ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టడం మొదలెడ్తారు. 'ఇక మీ ఏడ్పులు, పెడ బొబ్బలు ఆపేయండి. మీరు ఎంత ఏడ్చి మొత్తుకున్నా మా నుండి మీకు ఎలాంటి సహాయం లభించదు. నా సూక్తులు విన్పిస్తుంటే మీరు ముఖం తిప్పుకొని వెళ్ళిపోయేవారు. అహంకారంతో వాటిని ఖాతరు చేసేవారుకాదు. కట్టుకథలతో, వ్యర్థప్రలాపాలతో కాలం వెళ్ళబుచ్చేవారు." (ఖుర్ఆన్–23:63–67)

"ప్రాపంచిక వ్యామోహంలో పరస్పరం పోటీపడి వీలైనంత ఎక్కువ సంపాదించాలన్న తపనే మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరికి (అదే రందిలో) మీరు సమాధికి చేరుకుంటారు. (మీరసలు ప్రాపంచిక

సంపదే ప్రగతికి చిహ్నమని అనుకుంటున్నారు.) ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది (వాస్తవం ఏమిటో). ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది. ఎంతమాత్రం కాదు. విశ్వసనీయ జ్ఞానంతో మీరు విషయాన్ని గ్రహిస్తే (మీ వైఖరి ఇలా ఉండదు). మీరు తప్పక నరకాన్ని చూస్తారు. ఔను, మీరు నమ్మకంగా దాన్ని మీకళ్ళారా చూస్తారు. ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదలను గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది." (ఖుర్ఆన్–102:1–8)

దైవాన్ని, పరలోకచింతను విస్మరించి ప్రాపంచిక వ్యామోహపరుడయి పోయిన మనిషి తన సుఖసంతోషాల కోసం వీలైతే ఎన్ని అడ్డదారులైనా తొక్కి డబ్బుసంపాదిస్తాడు. అన్యాయం, అవినీతి, అక్రమాల ద్వారా కోట్లు సంపాదిస్తాడు. విలాసాల కోసం వాటిని విచ్చలవిడిగా ఖర్చుపెడ్తాడు. ఈ అన్యాయం, అక్రమాలకు పాల్పడినందుకు సత్యతిరస్కారిని దేవుడు ఇహ లోకంలో శిక్షించడు. ఇహలోకం పరీక్షాసదనమయి నందున దేవుడు అతడ్ని ఇక్కడ శిక్షించకుండా అతని అక్రమాలకు, విలాసవంతమైన జీవిత మనుగడ కోసం మరింత అవకాశం ఇస్తాడు.

అయితే సత్యతిరస్కారులు ప్రాపంచిక వ్యామోహం, ఏమరుపాటు అనే మత్తును వదలేయడానికి దేవుడు అప్పుడప్పుడు ప్రకృతివైపరీత్యాల రూపంలో వారిని ఇహలోకంలో కూడా శిక్షిస్తుంటాడు.

"ప్రతి యేటా వారు ఒకటి రెండు సార్లు పరీక్షకు గురిచేయబడుతున్నారని వారికి తెలియదా? అయినా వారు పశ్చాత్తాపంచెంది దేవునికి క్షమాపణ చెప్పుకోవడం లేదు. ఎలాంటి గుణపాఠం నేర్చుకోవడంలేదు." (ఖు–9:126)

ఆ తరువాత వారి అక్రమ సంపాదనలు, ధనకనక వస్తువుల్ని గురించి పరలోక న్యాయస్థానంలో కఠినంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది. సిరిసంపదలు, ఇతర జీవితావసరాలు ఎంత ఎక్కువగా ఉంటే విచారణ అంత సుదీర్ఘకాలం సాగుతుంది. అక్రమ సంపాదనలు, ధనదుర్వినియో గాలు రుజువైన తర్వాత వారిని దైవదూతలు నరకంలోకి నెట్టివేస్తారు.



"దేవుడు తాను కోరినవిధంగా కొందరికి ఇతోధికంగా, మరికొందరికి పరిమితంగా ఉపాధినిస్తాడు. వారు ప్రాపంచిక జీవితంలో మునిగితేలు తున్నారు. కాని పరలోకజీవితం ముందు ప్రాపంచికజీవితం మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే." (13:26); "ప్రవక్తా! ప్రపంచదేశాలలో సత్యతిరస్కారుల తిరుగుళ్ళు, తీరుతెన్నులు చూసి నీవు మోసపోకు. ఇది మూన్నాళ్ళముచ్చట మాత్రమే. తర్వాత వారి శాశ్వతనివాసం నరకమవుతుంది. అది పరమ చెడ్డ నివాసం. అయితే తమ ప్రభువు పట్ల భయభక్తులతో మసలుకుంటూ నీతి మంతమైన జీవితం గడిపేవారి కోసం సెలయేరులు పారే స్వర్గవనాలున్నాయి. అక్కడే వారు కలకాలం (హాయిగా)ఉంటారు." (ఖుర్ఆన్–3:196,197)

## విధివ్రాత, అదృష్టం-దురదృష్టం

ఈ ప్రపంచంలో మానవులకు కలిగే కీడు-మేలు, లాభం-నష్టం, కష్టం-సుఖం, దుఃఖం-సంతోషం సమస్తం దేవుని ఆదేశం, అభీష్టాల ప్రకారమే జరుగుతాయి. ఆయన ఆజ్ఞ లేకుండా, ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా చెట్టు నుండి ఒక ఆకయినా రాలదు, చీమయినా కుట్టదు. అయితే ఈ కష్టసుఖాలు, లాభనష్టాలు మానవుల ప్రవృత్తి, ఆచరణ, స్వభావాలు, గుణగణాలు, సంకల్పాలను బట్టి ఉంటాయి.

"భూమిపైగాని మీపైగాని వచ్చిపడే ఏఆపదైనా దాన్ని సృష్టించడానికి పూర్వమే మేము దాన్ని గురించి గ్రంథంలో వ్రాసిపెట్టాము. ఇలా చేయడం దేవునికి చాలా తేలిక. మీమీద ఏఆపద వచ్చినా మీరు బాధపడకుండా ఉండాలని, దేవుడు మీకు ఏభాగ్యం ప్రసాదించినా దాన్ని చూసుకొని మిడిసి పడరాదని (ఆయన ఈఏర్పాటు చేశాడు)." (ఖుర్ఆన్–57:22)

దైవప్రవక్త (స) హితోక్తి: "మీలో ప్రతిమనిషీ మాతృగర్భంలో ఇలా రూపొందుతాడు- మొదట నలభై రోజులదాకా (వీర్యబిందువు రూపంలో) ఉంటాడు. తరువాత అన్ని రోజులే ద్రవరక్తం రూపంలో ఉంటాడు. ఆ తరువాత అన్నే రోజులు మాంసపు ముద్ద (పిండం) రూపంలో ఉంటాడు. ఆతర్వాత దేవుడు ఒక దైవదూతను నాలుగు ఆజ్ఞలు ఇచ్చి పంపుతాడు.

అతని కర్మలు, ఉపాధి, ఆయుష్షులను గురించి వ్రాయమని ఆదేశిస్తాడు. అతను సౌభాగ్యుడవుతాడా, దౌర్భాగ్యుడవుతాడా అనే విషయాన్ని కూడా వ్రాయమని ఆదేశిస్తాడు. ఆ తర్వాత అతనిలో ప్రాణం పోయబడుతుంది.

పోతే మీలో ఒకడు (సత్)కర్మలు చేస్తుంటాడు. ఈవిధంగా చివరికి (ఆ సత్కర్మల కారణంగా) అతనికి, స్వర్గానికి మధ్య ఒక గజం మాత్రమే దూరం ఉండిపోతుంది. ఆ తరువాత అతని జాతకం మారిపోయి అతను నరకవాసులు చేసే పనులు చేస్తాడు. అలా చివరికి (ఆ దుష్కర్మల వల్ల) అతనికి నరకానికి మధ్య గజం మాత్రమే దూరం ఉండిపోతుంది. అంతలో అతని జాతకం మారిపోయి అతను స్వర్గవాసులు చేసే పనులు చేస్తాడు. (ఫలితంగా అతను స్వర్గానికి పోతాడు.)- (బుఖారి)

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం: ఒకతను లేచి "దైవప్రవక్తా! స్వర్గవాసులెవరో, నరకవాసులెవరో (ముందుగానే) గుర్తించ బడ్డారా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) ఔనన్నారు. అప్పుడా వ్యక్తి "అలాంటప్పుడు మానవులు కర్మలు ఆచరించడం దేనికీ?" అని ప్రశ్నించాడు. దానికి దైవప్రవక్త (స) "ప్రతిమనిషీ తాను దేనికోసం పుట్టించ బడ్డాడో ఆ పనులే చేస్తాడు" అని అన్నారు. లేక "ఎలాంటి బుద్ధి ఇవ్వ బడిందో అలాంటి పనులే చేస్తాడు" అని చెప్పారు. (బుఖారి)

హజ్రత్ అలి (రజి) కథనం: దైవప్రవక్త (స) (తమ అనుచరులతో) "మీలో ప్రతిఒక్కరికి లభించే స్వర్గనరకాలు (ముందే వారి అదృష్టంలో) వ్రాయబడ్డాయి" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "అయితే దైవప్రవక్తా! మేము విధివ్రాతపై భారం వేసి కర్మలు ఆచరించడం మానేయ వచ్చా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు- "మానేయకూడదు. కర్మలు ఆచరిస్తూనే ఉండాలి. మనిషి ఏపని కోసం పుట్టించబడ్డాడో అతనికి ఆ పనిచేసే బుద్ధే లభిస్తుంది. అదృష్టవంతుడికి స్వర్గానికి గొనిపోయే కర్మలు ఆచరించే బుద్ధి లభిస్తుంది. దురదృష్టవంతుడికి నరకానికి దారితీసే కర్మలు ఆచరించే బుద్ధి లభిస్తుంది."



ఆ తర్వాత ఆయన ఈ సూక్తులు పఠించారు-"ధనాన్ని దానంచేసి, దైవభీతిపరుడై, మంచిని సమర్థించేవాడికి మేము సులువైన మార్గాన నడి చేందుకు సౌలభ్యం కలగజేస్తాం. పిసినారితనం వహించి, (దేవుణ్ణి) ఖాతరు చేయకుండా, మంచిని ధిక్కరించే వాడికి మేము కష్టతర మార్గాన నడిచేందుకు సౌలభ్యం కలగజేస్తాం." (92:5-10)- (బుఖారి, ముస్లిం)

## ఆదం, మూసా (అలై)ల సంభాషణ

దైవప్రవక్త (స) ప్రవచనం: మూసా, ఆదం (అలై)ల మధ్య సంభాషణ జరిగింది. మూసా (అలై) ఆదం (అలై)తో మాట్లాడుతూ "ఆదం! మీరు మా పితామహులు. కాని మీరు మమ్మల్ని (మానవుల్ని) నిరర్థకం చేశారు. మమ్మల్ని స్వర్గంనుంచి తీసివేయించారు" అన్నారు. దానికి ఆదం ఇలా అన్నారు: "మూసా! దేవుడు నిన్ను ప్రత్యక్షసంభాషణ కోసం ఎన్నుకున్నాడు. తన స్వహస్తాలతో నీకు (తౌరాత్) రాసిచ్చాడు. అలాంటి (ఉన్నతస్థానం పొందిన) నీవు, నన్ను సృష్టించడానికి నలభై యేళ్ళకు పూర్వమే దేవుడు నా అదృష్టంలో రాసిన విధివ్రాత పట్ల నన్ను నిందిస్తున్నావా?" ఇలా ఆదం ఈ ప్రమాణం ద్వారా మూసాపై విజయం సాధించారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆదం (అలై) ఇక్కడ కర్మలు ఆచరించి పరలోకానికి వెళ్ళిన తరువాతే మూసా (అలై)తో ఇలా అన్నారు. దేవుడు ఆయన పొరపాట్లు క్షమించాడు. ఇక ఆయనపై ఎలాంటి నిందలేదు. కనుక పాపం చేసిన ఏమనిషీ హజ్రత్ ఆదం (అలై)లా జవాబిచ్చి శిక్ష నుండి తప్పించుకోలేడు. ఒకవేళ ఎవరైనా పిడివాదం చేస్తూ "నాఅదృష్టంలో పాపాలు చేయాలని రాసి పెట్టిఉంది గనక నేను పాపాలు చేస్తున్నా; నన్ను నిందించకూడద"ని అంటే, "నీ అదృష్టంలో ఆ పాపాలకు నరకశిక్ష అనుభవిస్తావని కూడ రాసిపెట్టి ఉంది గనక, నరకశిక్ష అనుభవించు" అని సమాధానం వస్తుంది. ఎవరి అదృష్టంలో ఏముందో మానవులకు తెలియదు. అందువల్ల పైశాచిక ఆలోచనలకు పోకుండా శక్తిమేరకు సత్కర్మలు ఆచ రించడమే బుద్ధిమంతుల పని.

అబీఖిజామా (రజి) గారి తండ్రి కథనం: నేనొక సారి దైవప్రవక్త (స)ను "మేము మావ్యాధుల నివారణకోసం చేసే ప్రార్థనలు, కట్టుకునే తాయత్తులు, వాడే మందులు; కష్టాల నుండి కాపాడుకోడానికి మేము తీసుకునే ముందు జాగ్రత్తలు విధివ్రాతను మార్చగలవా?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) "ఇవి కూడా విధివ్రాతలోనే ఉంటాయి" అని చెప్పారు. (తిర్మిజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: ఒకరోజు నేను దైవప్రవక్త (స) వెనుక వాహనమ్మీద కూర్చున్నాను. అప్పుడాయన నాకిలా ఉదేశించారు- "అబ్బాయ్! నేను నీకు కొన్నిమాటలు చెబుతాను జాగ్రత్తగా విను. నువ్వు దేవుణ్ని జ్ఞాపకం పెట్టుకో, దేవుడు నిన్ను జ్ఞాపకం పెట్టుకుంటాడు. నువ్వు దేవుణ్ని జ్ఞాపకం చేసుకుంటే దేవుణ్ని నీ ముందు పొందుతావు. నువ్వేదైనా అర్థించాలనుకుంటే దేవుణ్ని (మాత్రమే) అర్థించు. ఏదైనా ఆపదలో ఉండి సహాయం కోరదలచుకుంటే దేవునిసహాయం కోరుకో. దేవుణ్ని నీ సహాయ కుడిగా చేసుకో. ఒక విషయం గుర్చుంచుకో. ప్రజలంతా కలసి నీకేదైనా ప్రయోజనం చేకూర్చదలిస్తే, దేవుడు నీ అదృష్టంలో రాసిపెట్టింది తప్ప మరెలాంటి ప్రయోజనం చేకూర్చలేరు. అలాగే ప్రజలంతా కలిసి నీకేదైనా నష్టం కలగజేయదలచుకుంటే, దేవుడు నీ అదృష్టంలో రాసిపెట్టింది తప్ప మరెలాంటి నష్టం కలగజేయలేరు." (మిష్కాత్ షరీఫ్)

దైవప్రవక్త (స) హితోక్తి: "బలహీనుడైన విశ్వాసి కంటే బలవంతుడైన విశ్వాసియే శ్రేష్ఠుడు, దేవునికి ఎక్కువ ప్రియమైనవాడు. అయితే ఇద్దరిలో శ్రేయస్సుంది. నీవు ప్రయోజనం చేకూర్చే విషయాల్ని కోరుకో. కష్టాలు ఎదురైనప్పుడు దేవుని సహాయం వేడుకో, అధైర్యంచెందకు. ఏదైనా ఆపద వస్తే, ఒకవేళ నేనిలా చేసివుంటే ఇలా అయ్యేది కాదని అనకు. దానికి బదులు 'నా అదృష్టంలో ఉన్నట్లు దేవుడు తలచింది జరిగింది' అని భావించు. 'ఒకవేళ' అనే మాట పైశాచిక చేష్టలకు తలుపు తెరుస్తుంది." (మిష్కాత్)

కాబట్టి ఎప్పుడైనా కష్టాలుగాని, నష్టాలుగాని వస్తే మనిషి "ఒకవేళ నేనలా చేసివుంటే ఇలా జరిగేది కాదని, ఇదంతా తన దురదృష్టమని తలచి



చేతులు ముడుచుకొని కూర్చోకూడదు. దానికి బదులు ఆ కష్టాలకు లేక నష్టాలకు కారణం తనవల్ల ఏదైనా పొరపాటు జరిగిందా, లేక మరేదైనా కారణం ఉందా అని పరిశీలించి వాటిని దూరంచేయడానికి, ముందుకు సాగడానికి ప్రయత్నించాలి. అప్పుడు ఈ పరిశీలన, ప్రయత్నాలు కూడా అతని అదృష్టంలోని విషయాలే అవుతాయి.

## స్వయంకృతాపరాధం

ఇహలోకంలో కష్టనష్టాలు మంచివాళ్ళకూ వస్తాయి, చెడ్డవాళ్ళకూ వస్తాయి; విశ్వాసులకూ వస్తాయి, అవిశ్వాసులకూ వస్తాయి. ఈ కష్టనష్టాలకు కారణం మానవుని స్వయంకృతాపరాధం కూడా కావచ్చు.

"ప్రజలు చేసిన (అ)కృత్యాల కారణంగా నేలపై, నీటిపై సంక్షోభం ఏర్పడింది. వారికి దేవుడు వారి దుష్కార్యాల పర్యవసానాన్ని చవిచూపేందుకే ఇలా జరిగింది, ఈ శిక్ష వల్ల వారు (తమ దుశ్చర్యలు) మానుకుంటారేమో (చూడాలి)." (ఖుర్ఆన్–30:41)

ఈసూక్తి క్రీ.శ. 603-628 మధ్య రోమ్, ఈరాన్‌లకు జరిగిన యుద్ధం వైపు సూచిస్తోంది ఈ యుద్ధజ్వాలలు యావత్తు మధ్యప్రాచ్యాన్ని చుట్టుముట్టాయి. ఆనాడు ప్రజలు సాంప్రదాయిక ఆయుధాలైన ఖడ్గం, ఈటె, ధనుర్బాణాలు మాత్రమే ఉపయోగించేవారు. ఈనాటియుద్ధాలు సృష్టిస్తున్న విధ్వంసకాండతో పోల్చితే, ఆనాటి యుద్ధాలు సృష్టించిన విధ్వంసం పెద్దగా లెక్కలోనికి రాదు. కాని ఈనాడు క్షణాల్లో నగరాలకు నగరాలనే నేలమట్టంచేసే అణుబాంబులు వచ్చాయి.

ఈసూక్తి నేటి ఆధునిక కాలంలో రష్యా-అమెరికాల మధ్య జరిగిన యుద్ధాలకు, తర్వాత ఏకైక సూపర్‌పవర్‌గా నిలిచిన అమెరికా తృతీయ ప్రపంచదేశాలపై జరుపుతున్న మారణకాండలకు సరిగ్గా వర్తిస్తుంది.

అధునాతన ఆయుధాలతో బలిసిన దేశాలలోని ట్యాంకర్లు, రాకెట్లు, క్షిపణులు, జెట్‌ఫైటర్లు, హొవిట్జర్లు, ఫ్రిగేట్లు, డిస్ట్రాయర్లు, క్రూసియర్లు,

క్లస్టర్‌బాంబులు, కార్పెట్‌బాంబులు వగైరా ఆయుధాలు సృష్టించే విధ్వంస కాండలు ఎంతో భయంకరంగా ఉంటాయి. ఇవి నిర్దేశిత లక్ష్యాలను ధ్వంసంచేయడమే కాకుండా, రిమోట్ కంట్రోల్‌సిస్టమ్స్, హైటెక్ కంప్యూటర్ సిగ్నల్స్ కారణంగా ఒక్కోసారి అనుకోని ప్రమాదాలు కూడా తెచ్చిపెడ్తాయి.

అమెరికా దగ్గర ప్రయోగదశలో ఉన్న స్టార్‌వార్స్ ప్రాజెక్టు ఇంతకంటే ఎంతో ప్రమాదకరమైనది. ఈ ప్రాజెక్టు కేంద్రం నుండి శక్తిమంతమైన లేజర్ కిరణాలను అంతరిక్షంలోని తమ ఉపగ్రహ నౌకకుండే ఓ పెద్ద అద్దం మీదికి ప్రసరింపజేస్తారు. అక్కడ్నుంచి తాము లక్ష్యంగా పెట్టుకునే శత్రుదేశం ఉపరితల వాతావరణంలోకి ప్రతిబింబింపజేసి అక్కడి ఓజోన్ పొరకు తూట్లువేస్తారు. దానివల్ల సూర్యుడి నుండి వెలువడే అల్ట్రావైలెట్ కిరణాలు నేరుగా భూమిపై పడి కేన్సర్‌లాంటి భయంకర వ్యాధులు కలగజేసి క్రమంగా మారణహోమం సృష్టిస్తాయి. అంతేకాదు, మనుషుల్ని మౌనంగా మట్టుపెట్టే జీవాయుధాలు కూడా ఉనికిలోకి వచ్చాయి.

నేటి ఆయుధాల ప్రయోగంవల్ల మనుషులు చావడం, గాయపడటమే గాకుండా, పర్యావరణం కూడా దెబ్బతిని బ్రతికున్నవారికి 'యమ' హెచ్చరి కలు చేస్తోంది. ప్రజల జీవితావసరాలపై తగిన శ్రద్ధ చూపకుండా పేరు ప్రతిష్ఠల కోసం ప్రాకులాడే రాజ్యాధినేతలు అత్యాధునిక ఆయుధాల తయారీ కోసం ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. దాంతో 'కూడు-గూడు' నినాదంతో జనాన్ని ఊదరగొట్టిన ఒకనాటి సోవియట్ రష్యా నేడు తన పౌరులకే కడుపునిండా కూడు పెట్టలేక సతమతమవు తోంది. అలాగే మొన్నటిదాకా యావత్ ప్రపంచంలోనే గొప్ప ధనిక దేశంగా పేరొందిన అమెరికా ఇప్పుడు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో పడిపోయింది. అనేక వ్యాపారసంస్థలు తమ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక అనేక మందికి ఉద్వాసనలు పలుకుతున్నాయి; కొన్ని వ్యాపారసంస్థలు మూతలు పడ్డాయి. ఆ దేశంలో కొన్నిచోట్ల కార్లలో షికార్లు కొట్టే మధ్యతరగతి ప్రజలు నిత్యావసర వస్తువుల కోసం దుకాణాల ముందు 'క్యూ'లు కడ్తున్నారు.



దేవుడు తన ప్రవక్తల ద్వారా పంపిన రుజుమార్గం విస్మరించినవారు ఆధునిక విజ్ఞానాన్ని లోకకల్యాణం కోసం వినియోగిస్తారని ఎన్నటికీ ఆశించలేము. ముఖ్యంగా మానవ సంక్షేమం కోసం దైవం ప్రసాదించిన ఈ విజ్ఞానం స్వార్థపరులు, నాస్తికులు, అధికార పిపాసులు, రాజ్యవిస్తరణ కాంక్షాపరుల చేతికి చిక్కితే మొత్తం భూమండలమే నాశనమవుతుంది.

## కార్యకారణ ప్రపంచం

ఇహలోకం మానవుల పాలిట పరీక్షాసదనం కావడంతో పాటు, కార్య కారణ ప్రపంచం కూడా అవుతుంది. అంటే ఇక్కడి కష్టనష్టాలకు కారణం ఉంటుంది. నిప్పురవ్వ మీద చేయిపెడితే మంచివాడికీ కాలుతుంది; చెడ్డ వాడికీ కాలుతుంది. అలాగే ఒకవ్యక్తి లేక ఒకరాజ్యం చేసే దుర్మార్గపు పనికి మంచివాళ్ళు కూడా బలయిపోతారు.

"మీకు ఏ ఆపద వచ్చినా అది మీ చేజేతులా తెచ్చిపెట్టుకున్నదే అవు తుంది. మీరు చేస్తున్న అనేక పొరపాట్లను ఆయన ఇట్టే క్షమించి వదిలే న్నాడు. కాని మీరు ప్రపంచంలో దేవుని పట్టునుండి తప్పించుకొని ఎక్కడికీ పారిపోలేరు." (42:30,31); "దేవుడు మానవులకు ఎన్నటికీ అన్యాయం చేయడు. వారే ఆత్మవంచనకు పాల్పడుతున్నారు." (ఖుర్ఆన్-10:44)

"వారికేదైనా ప్రయోజనం చేకూరితే "ఇది దేవుని దయవల్ల లభించింది" అంటారు. నష్టం జరిగితే "ఇది నీ మూలంగా జరిగింది" అంటారు. చెప్పు, అంతా దేవుని వల్లనే జరుగుతుందని. అసలు వారికేమయింది, ఏ మాటా అర్థం చేసుకోరు? మానవా! నీకు ఏమేలు జరిగినా అది దేవుని దయవల్లనే జరుగుతుంది. ఒకవేళ నీకేదైనా కీడు జరిగితే అది నీ చేజేతులా చేసుకున్న దాని ఫలితమని తెలుసుకో." (ఖుర్ఆన్-4:78,79)

నిప్పు కాలుతుందని, తేలు కుడ్తుందని పాలుతాగే పసివాడికి తెలి యదు. కొన్నేళ్ళకు ప్రాపంచికస్పృహ వచ్చిన తర్వాతే వాస్తవం తెలుస్తుంది. కొన్ని విషయాల జోలికిపోతే ప్రమాదానికి గురి కావల్సివస్తుందని తెలిసిన వారు చెప్పేదాకా పెద్దవాళ్ళకృూడా తెలియదు. మన దేశంలో విద్యుచ్ఛక్తి

వచ్చిన కొత్తలో చాలామంది గ్రామస్థులకు ఇన్సులేషన్ లేని విద్యుత్తీగను ముట్టుకుంటే షాక్ కొడ్తుందని తెలియదు. ఆ తర్వాత వారు విద్యుచ్ఛక్తి గురించిన కనీసజ్ఞానం పొందగానే జాగ్రత వహించడం ప్రారంభించారు.

ప్రాపంచిక చట్టాల విషయంలో కూడా ప్రజలు కనీసజ్ఞానం సంపాదించవలసి వుంటుంది. మన దేశంలో మద్యపాన సేవనం నేరం కాకపోవచ్చు. అరబ్‌దేశాల్లో ఇది నేరం. ఆ దేశాలకు పోయే తాగుబోతులు సంబంధిత చట్టం గురించి తెలుసుకొని మద్యం జోలికి పోకుండా జాగ్రత పడాలి, లేకుంటే దేహశుద్ధి జరుగుతుంది. మనదేశంలో వాహనాలు రోడ్డుకు ఎడమవైపున, కొన్ని విదేశాల్లో కుడివైపున నడపవలసిఉంటుంది. ఈ చట్టాల్ని గురించి తెలుసుకోకుండా రాంగ్‌సైడ్‌లో నడిపితే పోలీసులు భారీ జరిమాన విధిస్తారు. ఒక్కోసారి ప్రమాదం సంభవించి చాలా నష్టం కూడా జరుగుతుంది. పైపెచ్చు న్యాయస్థానం శిక్ష కూడా విధిస్తుంది. ఈ శిక్షల విషయంలో సజ్జనులు, దుర్జనులనే తేడా ఉండదు.

ఇది ప్రాపంచిక చట్టాలను గురించిన విషయం. ఈ చట్టాలలో మనిషి కొన్నిటిని ఉల్లంఘించి, పోలీసుల కళ్ళుగప్పి శిక్ష నుండి తప్పించుకోవచ్చు. కొన్నిటిని ఉల్లంఘిస్తే కాళ్ళు-చేతులు విరగవచ్చు; ఆరోగ్యం చెడిపోవచ్చు.

ప్రాపంచిక చట్టాల్లాగే పారలౌకిక చట్టాలు కూడా ఉన్నాయి ఈ ప్రపంచంలో. ఈ చట్టాలకు సంబంధించిన పోలీసులు, పర్యవేక్షకులు మానవులకు కన్పించరు. వాటిని ఉల్లంఘిస్తే వెంటనే వచ్చే నష్టం కూడా ఏమీ లేదు. కాని వీటి దుష్పర్యవసానాలు పరలోకంలో తీవ్రంగా ఉంటాయి.

“మానవుని కుడి, ఎడమల వైపు ఇద్దరు (అదృశ్య) లేఖకులు కూర్చొని (అతని) ప్రతి పనినీ, ప్రతి పలుకునూ నమోదు చేస్తున్నారు. అతని నోట ఏదైనా మాట వెలువడగానే దాన్ని నమోదుచేయడానికి ఒక పర్యవేక్షకుడు తక్షణమే అక్కడ ప్రత్యక్షమవుతాడు.” (50:17,18); “ప్రతి మనిషికీ ముందూ వెనుకా దేవుడు నియమించిన (అదృశ్య) గూఢచారులు ఉన్నారు. ఆయన ఆజ్ఞతో వారతడ్ని పర్యవేక్షిస్తుంటారు.” (ఖుర్ఆన్-13:11)



“ఆయన మిమ్మల్ని పర్యవేక్షించేవారిని నియమించి పంపుతున్నాడు. మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమైనప్పుడు ఆయన పంపే దూతలే అతని ప్రాణం తీసికెళ్తారు.” (ఖుర్ఆన్-6:61)

“దైవదూతలు అవిశ్వాసుల ప్రాణాలు తీస్తున్నప్పటి స్థితి నీవు చూస్తే బాగుండు! వారప్పుడు అవిశ్వాసుల ముఖాలపై, పిరుదులపై కొడుతూ “ఇక దహనయాతన చవిచూడండి. ఇది మీరు చేజేతులా కొని తెచ్చుకున్నదాని పర్యవసానమే. అంతేగాని దేవుడు తన దాసులకు ఎలాంటి అన్యాయం చేసేవాడుకాదు” అనంటారు.” (ఖుర్ఆన్-8:50,51)

“దైవదూతలు విశ్వాసుల ఆత్మల్ని పవిత్రంగా ఉన్నప్పుడు స్వాధీనం చేసుకుంటూ ‘మీకు శాంతి కలుగుగాక! మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి’ అంటారు.” (ఖుర్ఆన్-16:32)

మనిషి ప్రపంచంలో కష్టనష్టాల బారిన పడకుండా క్షేమంగా ఉండేందుకు ప్రాపంచిక చట్టాల్ని గురించిన కనీస జ్ఞానం తెలుసుకొని తదనుగుణంగా నడుచుకుంటాడు కదా! అదేవిధంగా శాశ్వతమైన పరలోక కష్టనష్టాలకు గురికాకుండా సదా సుఖంగా ఉండదలచిన మనిషి పారలౌకిక చట్టాల్ని గురించి కూడా తెలుసుకొని తదనుగుణంగా ఇక్కడ జీవితం గడపవలసి ఉంటుంది. అలా చేయకపోతే అక్కడ రక్తకన్నీటితో తీవ్రంగా పశ్చాత్తాపం చెందవలసివస్తుంది. ఒక్కోసారి మానవుల నేరాలు హద్దుమీరినప్పుడు ప్రపంచంలో కూడా వారిని పారలౌకిక పోలీసులు శిక్షిస్తారు.

“ఏజాతి అయినా తనను తాను సంస్కరించుకోనంత వరకూ దేవుడు దాని పరిస్థితి మార్చడు. అలాగే ఏదైనా జాతికి దేవుడు కీడు చేయదలచుకుంటే ఇక దానికి తిరుగేఉండదు. దైవనిర్ణయానికి వ్యతిరేకంగా అలాంటి జాతిని ఏశక్తీ ఆదుకోజాలదు.” (ఖుర్ఆన్-13:11)

దైవప్రవక్త (స) హితోక్తి: “వ్యభిచారం సర్వసామాన్యమైన ఏజాతీ కరువు కాటకాలకు గురవకుండా ఉండదు. అలాగే లంచం విస్తరించిపోయిన ఏ జాతీ భయాందోళనలకు గురవకుండా ఉండదు.” (ముస్నద్అహ్మద్)

దైవప్రవక్త (స) హితోక్తి: "మీ నాయకులు చెడ్డవాళ్ళయి, మీ ధనికులు పిసినారులయి, మీ వ్యవహారాలు స్త్రీల చేతుల్లోకి పోయి ఉన్నప్పుడు మీకు భూమి వీపు (జీవితం) కంటే భూమి కడుపు (మృత్యువు) మంచిది." (తిర్మిజి)

దైవప్రవక్త (స) హితోక్తి: "నమ్మక ద్రోహం సర్వసామాన్యమైన జాతిలో దేవుడు శత్రుభయం, బీభత్సాలు వ్యాపింపజేస్తాడు. వ్యభిచారం అంటువ్యాధిలా వ్యాపించిన సమాజం సర్వనాశనం కాకతప్పదు. తూనికలు కొలతల మోసం సర్వవ్యాప్తమైపోయిన సమాజం ఆహారశుభం కోల్పోతుంది. అన్యాయమైన తీర్పులు, నిర్ణయాలు జరిగే చోట రక్తపాతం జరిగితీరుతుంది. ఒప్పందం ఉల్లంఘించిన జాతిని శత్రువు తప్పకుండా జయిస్తాడు." (మిష్కాత్)

దైవశిక్షలకు మొట్టమొదటి ముఖ్యకారణం- ఏకదైవారాధన కాదని బహుదైవారాధనకు, సృష్టికర్తను వదలి సృష్టిపూజకు పాల్పడటమే. ఆ తరువాత నైతిక విలువల ఉల్లంఘన వస్తుంది.

## దౌర్జన్యజాతులకు దైవదండన

"మీ చుట్టుప్రక్కల ప్రాంతాల్లోని అనేక ఊళ్ళను మేము నాశనం చేశాము. ఆ ప్రజలు తమ వైఖరి మానుకుంటారేమోనని, మేము మా సూక్తులు పంపి అనేకసార్లు అనేక విధాలుగా నచ్చజెప్పాం. వారు దేవుణ్ణి వదలి ఇతర శక్తుల్ని దైవసామిప్య సాధనాలుగా భావించి పూజించేవారు. మరి అవి వారిని (ఆపదలో) ఎందుకు ఆదుకోలేదు? అసలవి వారి నుండి కనుమరుగైపోయాయి. ఇదీ వారి అసత్యాలు, అభూతకల్పనల పర్యవసానం." (ఖుర్ఆన్-46:27,28)

"మేము పాపాత్ములుండిన ఎన్నో పట్టణాలు నాశనం చేశాం. ఈనాడవి తల్లక్రిందులుగా పడి (శిథిలావస్థలో) ఉన్నాయి. ఎన్ని బావులు పాడుపడి ఉన్నాయి! మరెన్ని మేడలు శిథిలాలుగా మారిపోయాయి!! వీరు ప్రపంచంలో తిరిగి చూడరా? (తిరిగి చూస్తే) వారి హృదయాలు (వాస్తవాన్ని) అర్థం చేసుకునేవిగా, వారి చెవులు (సత్యాన్ని) వినేవిగా మారేవి కదా! నిజానికి చర్మచక్షువులకు అంధత్వం లేదు. హృదయ చక్షువులకే అంధత్వం ఉంది. (ఖురాన్-22:45,46)



"ఎన్నో పట్టణాలు దుర్మార్గానికి పాల్పడ్డాయి. నేను మొదట్లో వాటికి అవకాశమిచ్చాను. ఆ తర్వాత వాటిని పట్టుకున్నాను(22:48); దుర్మార్గులు భోగభాగ్యాలలో తేలియాడుతూ పాపపంకిలంలో కూరుకుపోయారు. ప్రజలు సంస్కర్తలై మంచిపనులు చేస్తుంటే దేవుడు వారి పట్టణాలను ఎన్నటికీ అన్యాయంగా నాశనం చేయడు. దేవుడు అలాంటివాడు కాదు." (ఖుర్ఆన్-11:117)

"మీరు కృతజ్ఞులై విశ్వాసవైఖరి అవలంబిస్తే దేవుడు మిమ్మల్ని అనవసరంగా ఎందుకు శిక్షిస్తాడు? దేవుడు ఎంతో ఆదరించేవాడు, సర్వం తెలిసినవాడు." (4:147); "మేము ధరణిలో మీకు పూర్తి అధికారాలిచ్చి వసింపజేశాం. మీకోసం ఇక్కడ జీవన సామగ్రి సమకూర్చాం. కాని మీరు చాలాతక్కువగా కృతజ్ఞత చూపుతున్నారు." (ఖుర్ఆన్-7:10)

"మీకు పూర్వం మేము అనేకజాతుల దగ్గరకు ప్రవక్తలను పంపాము. ఆ జాతులు (తలబిరుసుతనం వహించినప్పుడల్లా) మేము వాటిని కష్టాలకు గురిచేశాం, దాని ద్వారానైనా వారు దీనంగా మాముందు తలవంచుతారన్న ఉద్దేశ్యంతో. ఈవిధంగా మేము వారిని కఠిన పరీక్షలకు గురిచేసినప్పుడు వారు మాముందు ఎందుకు దీనంగా తలవంచలేదు? అసలు వారి హృదయాలు పాషాణాల్లా కఠినమైపోయాయి. వారు చేస్తున్న దుష్కార్యాల్ని షైతాన్ వారికి మనోహరమైనవిగా చేసి చూపాడు. (ఖుర్ఆన్-6:42,43)

"(మా ప్రవక్తలు) చేసిన ఉపదేశాలు వారు పూర్తిగా విస్మరించారు. అప్పుడు మేము వారి కోసం సుఖసంతోషాలు దిగే ద్వారాలన్నీ తెరచి పెట్టాము. వారు మేమిచ్చిన అనుగ్రహాలు ఆస్వాదిస్తూ అందులో పూర్తిగా మునిగిపోయారు. అలాంటి స్థితిలో మేము హఠాత్తుగా వారిని పట్టుకున్నాం. దాంతో వారిక చేసేదిలేక పూర్తిగా నిరాశచెందారు. అలా మేము దుర్మార్గానికి పాల్పడినవారిని సమూలంగా తుడిచిపెట్టాం." (ఖుర్ఆన్-6:44,45)

"మేము ఏ పట్టణానికి దైవప్రవక్తను పంపినా ఆపట్టణవాసులు వినయవినమ్రతలకు దిగివచ్చేందుకు వీలుగా మొదట వారిని లేమికి, కష్టాలకు గురి చేస్తుంటాము. అలా లేమికి, కష్టాలకు గురిచేయకుండా ఉండటమన్నది

ఎన్నడూ జరగలేదు. తర్వాత ఆ దుస్థితి మార్చి వారికి మంచిస్థితి కల్గించాం. ఆవిధంగా వారు బాగా అభివృద్ధిచెంది (ఆ అభివృద్ధికి కారకుడైన సృష్టికర్తను విస్మరించి) 'మంచిరోజులు, చెడ్డరోజులు మన పూర్వీకులకూ వచ్చాయ'ని చెప్పసాగారు. చివరికి మేము హఠాత్తుగా వారిని పట్టుకున్నాం. వారప్పుడు పూర్తిగా ప్రాపంచిక మైకంలో పడిఉన్నారు." (ఖుర్‌ఆన్-7:94,95)

"పట్టణవాసులు గనక సత్యాన్ని విశ్వసించి దేవుని పట్ల భయభక్తులు కలిగిఉంటే, మేము వారి కోసం భూమ్యాకాశాల శుభాల (ద్వారాల)ను తెరచి పెట్టేవారము. కాని వారు సత్యాన్ని విశ్వసించడానికి నిరాకరించారు. అందువల్ల వారు చేసుకున్న కర్మలకు శిక్షగా మేము (ఉపద్రవం తెచ్చి) వారిని పట్టుకున్నాము." (ఖుర్‌ఆన్-7:96)

"మరి ఈ పట్టణవాసులు కూడా అలాగే ఏమరుపాటులో పడివున్నారా? రాత్రివేళ గాఢనిద్రలో ఉన్నప్పుడు వారిపై మాశిక్ష అకస్మాత్తుగా విరుచుకు పడదని తలచి గుండెల మీద చేతులు వేసుకొనిఉన్నారా? లేక పగటివేళ ఆడుతూ పాడుతూ ఉన్నప్పుడు మా ఉక్కు పిడికిలి వారి మెడలు పట్టుకోబోదని నిర్భయంగా ఉన్నారా? దేవుని ఎత్తుగడలంటే వారికి ఏమాత్రం భయం లేదా? సర్వనాశనమయ్యే జాతి మాత్రమే ఇలా దేవుని ఎత్తుగడల పట్ల భయమూ, భక్తీ లేకుండా మనుగడ సాగిస్తుంది. గత భూవాసుల తద నంతరం ఇప్పుడు భూమికి వారసులైనవారు, మేము తలచుకుంటే వారిపై ఆపద తెచ్చిపెడతామని, ఏ మంచి విషయం వినకుండా వారి హృదయ కవాటాలు మూసేస్తామని గ్రహించరా?" (ఖుర్‌ఆన్-7:97-100)

"మేము వారికి సంతానం సిరిసంపదలిచ్చి సహాయం చేస్తుంటే, అదే పనిగా మేము తమకు మేళ్ళు చేకూర్చుతున్నామని భావిస్తున్నారా? కాదు. అసలువిషయం వారు గ్రహించడంలేదు. తమ ప్రభువు పట్ల భయభక్తులు కలవారే మేళ్ళవైపు పరుగిడుతూ వాటిని పొందుతారు." (ఖురాన్-23:55,56)

"ఘోరమైన ఆ (పరలోక) శిక్షకు పూర్వం ఇహలోకంలో కూడా మేము వారికి (ఏదో ఓ శిక్ష చవిచూపిస్తూ ఉంటాము. దీని ద్వారానైనా వారు (తమ



ద్రోహబుద్ధి) మానుకుంటారేమో చూడాలి. విశ్వప్రభువు సూక్తులు పఠించి హితోపదేశం చేస్తుంటే, వాటిని వినకుండా ముఖం తిప్పుకునేవాడి కంటే పరమదుర్మార్గుడు ఎవరుంటారు? ఇలాంటి పాపాత్ములకు మేము తప్పకుండా ప్రతీకారం చేస్తాము." (ఖుర్‌ఆన్-32:21,22)

## ముస్లింల విశ్వాస పరీక్ష

సృష్టికర్త ముస్లింలను హెచ్చరిస్తూ ఇలా ఆదేశించాడు: "మీలో పాపాలు చేసినవారికే పరిమితమైపోని ఉపద్రవం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. దేవుడు అతి కఠినంగా శిక్షించేవాడని తెలుసుకోండి. (ఖుర్‌ఆన్-8:25)

దైవప్రవక్త (స) సంఘసంస్కరణ గురించి ఇలా హెచ్చరించారు:

"నాప్రాణం ఏశక్తిస్వరూపుని అధీనంలో ఉందో ఆ దేవుని సాక్షి! మీరు సత్కార్యాలు చేయమని ఆదేశించే, దుష్కార్యాల నుంచి వారించే పనైనా చేయాలి. లేదా దేవుడు మీపై శిక్షనయినా దించుతాడు. అప్పుడు మీరెంత మొరపెట్టుకున్నా ఆయన మీ మొరలు ఆలకించడు." (మిష్కాత్)

"ఏ జాతిలో చెడులు ప్రబలుతాయో ఆ జాతిలో ఉండే సంస్కరణా సామర్థ్యం కలవారు దాన్ని సంస్కరించకపోతే దేవుడా జాతి ప్రజలందరిపై ఏదైనా శిక్ష దించే సమయం ఆసన్నమైందని వారు తెలుసుకోవాలి." (మిష్కాత్)

"భయం, ఆకలి, ధనప్రాణ, పంటల నష్టాలు కలిగించి మిమ్మల్ని మేము తప్పని సరిగా పరీక్షిస్తాం. అలాంటి స్థితిలో సహనం వహించి, ఆపద వచ్చినప్పుడు 'మేము దేవుని ఆస్తులం. దేవుని వైపుకే పోవలసినవాళ్ళం'అని పలికేవారికి వారిప్రభువు కారుణ్య కటాక్షాలు లభిస్తాయని శుభవార్త చెప్పు. అలాంటివారే సన్మార్గగాములు." (ఖుర్‌ఆన్-2:155-157)

దైవధర్మాన్ని విశ్వసించామని ప్రకటించినవారికి ఆ ధర్మంపై ఏ మేరకు విశ్వాసం ఉందో పరీక్షించడం అవసరమని ఈ సూక్తి చెబుతోంది.

దేవుణ్ణి, దైవప్రవక్త (సల్లం)ను విశ్వాసించామని చెప్పుకున్నంత మాత్రాన ఏ మనిషీ పరలోక సాఫల్యానికి అర్హుడు కాలేడు. దైవప్రసన్నత, ఆయన

దివ్యదర్శనం, స్వర్గసుఖాలు అనేవి అంతతేలిగ్గా లభించే వస్తువులు కావు. వాటికోసం అతను అనేక పరీక్షలు ఎదుర్కోవలసి వస్తుంది. కష్టనష్టాలు భరించవలసి వస్తుంది. ధనప్రాణాల త్యాగానికి సయితం సిద్ధపడవలసి వస్తుంది. భయప్రలోభాల ద్వారా కూడా విశ్వాసులు పరీక్షించబడతారు. ఈ పరీక్షలన్నిటికీ తట్టుకొని దైవధర్మంలో స్థిరంగా నిలబడగలిగినవాడే దేవుని దృష్టిలో నిజమైన ముస్లిం.

ఈనాడు చాలామంది ముస్లింలు నమాజ్, ధ్యానం, ఉపవాసాలు లాంటి డబ్బు ఖర్చుకాని ఆరాధనలైతే చేస్తారుగాని, దైవమార్గంలో ధన త్యాగం చేయడానికి, ధర్మసంస్థాపన కోసం రేయింబవళ్ళు పని చేసేవారికి ఆర్థిక సహాయం అందజేయడానికి విశాలహృదయంతో ముందుకు రారు. కొడుకులతో పాటు కుమార్తెలకు ఆస్తిలో వాటా ఇవ్వరు. అంతెందకు, అనేకమంది ధనికులు పేదల ఆర్థికహక్కయిన జకాత్ కూడా చెల్లించరు. కాకపోతే యాచకులకు అప్పుడప్పుడు ఒకటి, రెండు రూపాయలు దానం చేస్తూ చేతులు దులుపుకుంటారు. హద్దుమీరిన ధనవ్యామోహంతో స్థిర చరాస్తులు కూడబెట్టుకోవడంలోనే ఎల్లప్పుడూ నిమగ్నులై ఉంటారు.

"నిందించే, హేళనచేసే, చాడీలుచెప్పే ప్రతివాడికీ వినాశం ఉంది. అతను (డబ్బు కూడబెట్టున్నాడు. దాన్ని మాటిమాటికి లెక్కపెట్టి దాచిపెట్టు న్నాడు. అతనీ సంపద శాశ్వతంగా తన దగ్గరుంటుందని భావిస్తున్నాడు. ఎంతమాత్రం ఉండదు. అతను కసకస నలిపి తొక్కివేసే చోట విసిరేయబడ తాడు. కసకస నలిపి తొక్కివేసే చోటంటే ఏమిటో నీకు తెలుసా? దేవుని (నరకా)అగ్ని. అది భగభగ మండుతూ గుండెలదాకా చేరుతుంది. వారినా అగ్నిగుండాలలో పడవేసి మూసేయడం జరుగుతుంది. ఈవిధంగా వారు పొడవైన (అగ్ని)కీలల మధ్య చిక్కుకొని ఉంటారు." (ఖుర్ఆన్–104:1–9)

ఈ ధనవ్యామోహమే వారిని పిసినారులుగా చేస్తుంది. కాని సిరిసంపదల ద్వారా కూడా దేవుడు మానవుల్ని పరీక్షిస్తాడనే సత్యం వారు గ్రహించడం లేదు. తత్ఫలితంగా వారు ఒక్కోసారి వ్యాపారంలో ఘోరంగా నష్టపోతారు;



ఊహించని వ్యాధుల బారిన పడినప్పుడు, తలకుమించిన కట్నకానుకల డిమాండు ఎదురైనప్పుడు స్థిరాస్తులు అమ్ముకొనో లేదా అప్పులు చేసైనా సరే లక్షలు ఖర్చుపెడతారు. పైగా ఈ కష్టనష్టాల వెనుక దైవపరీక్ష ఉందని తెలుసుకోవడానికి బదులు 'ఇదంతా తమ దురదృష్ట'మని తమనుతాము నిందించుకుంటారు. ఖుర్ఆన్‌లోని ఈక్రింది సూక్తులు చూడండి:

"మీ (విశ్వాస) పరిస్థితి ఏమిటో పరిశీలించి మీలో యోధులు, స్థిరచిత్తు లెవరో తెలుసుకోవడానికి మేము మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాము." (47:31); "స్వర్గప్రవేశం ఊరికే లభిస్తుందని భావిస్తున్నారా? మీకు పూర్వం విశ్వాసులకు సంభవించిన (కష్టనష్టాలు)వన్నీ ఇంకా మీకు సంభవించలేదే! వారిపై అనేక కష్టాలు, కడగండ్లు విరుచుకుపడ్డాయి." (2:214)

"ముస్లిములారా! మీరు ధనప్రాణాలు రెండిటి విషయంలోనూ అనేక కఠిన పరీక్షలకు గురికావలసివస్తుంది. అదీగాక గ్రంథప్రజల నుండి, బహు దైవారాధకుల నుండి కూడా మనస్సునొప్పించే మాటలు అనేకం విన వలసి వస్తుంది. కనుక అలాంటి స్థితిలో మీరు సహనం వహించి, భయభక్తులతో కూడిన జీవితం గడుపుతూ ధర్మమార్గంలో స్థిరంగా ఉండాలి." (3:186)

వహీబ్ బిన్ విర్ద్ (రహ్మ) ఉల్లేఖించిన ఒక హదీసు ప్రకారం దేవుడిలా చెబుతున్నాడు: "నేను ఏ దాసుణ్ణయితే ప్రపంచం నుండి లేపి కరుణించ దలచుకుంటానో ఆ దాసునికి అతని పాపాలకు ఫలితంగా ప్రపంచంలో వ్యాధులు, భార్యాపిల్లల గురించిన ఆపదలు, ఆర్థిక బాధలు కలిగిస్తాను. అప్పటికీ మరికొన్ని పాపాలు మిగిలివుంటే నేనతనికి మృత్యుకాఠిన్యం కలిగిస్తాను. (అంటే కఠినంగా ప్రాణంతీస్తాను.) దాంతో ఆ దాసుడు పుట్టి నప్పుడు పాపరహితుడై ఉన్నట్లు పరమ పావనుడై నా దగ్గరకు వస్తాడు.

నా గౌరవప్రపత్తుల సాక్షి! నేను ఏ దాసుణ్ణయితే ప్రపంచం నుండి లేపి శిక్షించదలచుకుంటానో ఆ దాసుడు చేసిన ప్రతి పుణ్యకార్యానికి ప్రతి ఫలం నేను ప్రపంచంలోనే అతనికి ఆరోగ్యం, ఉపాధిసమృద్ధి, భోగభాగ్యాల రూపంలో ప్రసాదిస్తాను. అప్పటికీ మరికొన్ని పుణ్యకార్యాలు మిగిలివుంటే

నేనతనికి మృత్యు సౌలభ్యం కలిగిస్తాను. (అంటే తేలికంగా ప్రాణం తీస్తాను.) దాంతో అతను నరకం నుండి కాపాడుకోవడానికి ఎలాంటి పుణ్యకార్యం లేనివాడై పరమపాపిష్ఠిగా నాదగ్గరకు చేరుకుంటాడు.'' (మౌత్కారుఖుట్కా)

విశ్వాసిపై కష్టాలు వచ్చిపడ్డాయంటే దేవుడతనికి ఏదో మేలు చేయ దలిచాడని తెలుసుకోవాలి. దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు:

"దేవుడు ఎవరికైనా మేలు చేయదలచుకుంటే అతడ్ని కష్టాలకు గురి చేస్తాడు.'' (బుఖారి); "దేవుడు తన దాసునికి మేలు చేయదలచినప్పుడు అతని పాపాలకు ప్రపంచంలోనే అతనికి (ఆపదలరూపంలో)శిక్ష విధిస్తాడు. ఒకవేళ దేవుడు ఎవరికైనా కీడు చేయదలిస్తే అతని పాపాలకు (ప్రపంచం లో) శిక్ష విధించకుండా ఆపిఉంచుతాడు. ఇలా ప్రళయదినం వరకు ఆపివుంచి ఆరోజు అతనికి పూర్తి శిక్ష విధిస్తాడు.'' (తిర్మిజి, మిష్కాత్)

"విశ్వసించిన స్త్రీలు, పురుషులు తమ ధన ప్రాణాలు, సంతానం విషయంలో నిరంతరం పరీక్షించబడతారు. ఈవిధంగా పరీక్షించబడుతూ చివరికి వారు అంతిమదినాన తమ పాపాలలో ఏఒక్కటీ మిగిలివుండని (పవిత్ర) స్థితిలో దేవుడ్ని కలుసుకుంటారు.'' (తిర్మిజి)

"విశ్వాసి అయిన దైవదాసుడు, జబ్బుపడితే లేదా అతనికేదైనా ఆపద వచ్చిపడితే- ఎలాంటి ఆపదైనా సరే. ఉదాహరణకు అతని జేబు నుంచి డబ్బేమైనా పోతే- ఇవన్నీ విశ్వాసిపాలిట పుణ్యఫలానికి కారణమవు తాయి. బంగారం స్వర్ణకారుడి కొలిమిలో కాలి స్వచ్ఛమై బయటికి వచ్చినట్లు కష్టాలు విశ్వాసి పాపాలు తుడిచి అతడ్ని పునీతుడ్ని చేస్తాయి.'' (మిష్కాత్)

"ముస్లింకు ఎప్పుడైనా ఏదైనా వ్యాధిగాని, కష్టంగాని వస్తే దేవుడు దాని ద్వారా చెట్టు నుండి ఆకులు రాలినట్లు అతని పాపాలను అంత మొందిస్తాడు.'' (ముస్లిం)

"కష్టాలకు గురైన కారణంగా విశ్వాసి ఎప్పుడైనా లోగడ చేస్తూ వస్తున్న ఏదైనా సత్కార్యాన్ని గత్యంతరంలేని పరిస్థితిలో చేయలేకపోతే, ఆ పుణ్య



ఫలాన్ని కూడా (అతని కర్మపత్రంలో) రాయండని దేవుడు తన దూతలను ఆదేశిస్తాడు.'' (మిష్కాత్)

"కష్టాల పరీక్ష ఎదురైనప్పుడు విశ్వాసి సహనం వహించి దైవస్తోత్రం చేస్తుంటే, అతను తల్లిగర్భం నుంచి ఈరోజే పుట్టిన బిడ్డలా ఏ పాపంలేని పరమపవిత్రుడై పోతాడు. అప్పుడు దేవుడు తన దూతల్ని ఉద్దేశించి 'నేనే నాదాసుడ్ని (పరీక్షకు గురికాకుండా) ఆపాను. నేనే అతడ్ని పరీక్షకు గురి చేశాను. కనుక అతనికోసం మీరతను ఆరోగ్యంగా ఉన్నప్పుడు రాస్తుండిన పుణ్యమే (ఇప్పుడూ) రాయండి' అని ఆజ్ఞాపిస్తాడు.'' (మిష్కాత్)

విశ్వాసానికి, పరీక్షకు నడుమ అవినాభావ సంబంధం ఉంది. విశ్వాసం ఉన్నచోట పరీక్ష తప్పనిసరిగా ఉంటుంది. పరీక్షకు లోనుకాని విశ్వాసం గీటురాయి తాకని కల్తీబంగారం లాంటిది. పరీక్షకు గురైనప్పుడే విశ్వాసి నిజస్వరూపం బయటపడ్తుంది. ఈ సత్యాన్ని విశ్వాసి ఎంతగా అర్థంచేసు కుంటే అంతగా అతను తనపై విరుచుకుపడే ఆపదలు సహించగలడు.

ఏమైనా విశ్వాసులకు కష్టాలు రావడం ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. కష్టాలు రాకపోవడమే ఆశ్చర్యకరమైన విషయం. ప్రతి కష్టం, ప్రతి నష్టం విశ్వాసికి ప్రయోజనకరమైన విషయమే. అలా అని కష్టాలు రావాలని కోరుకోకూడదు. ఎల్లప్పుడూ శాంతిశ్రేయాలు ప్రసాదించమనే దైవాన్ని వేడుకోవాలి. కష్టాలు ఎదురైతే మాత్రం సహనం పాటించాలి. అప్పుడు అతను దేవుని దృష్టిలో నిజమైన విశ్వాసిగా పరిగణించబడతాడు.

"ప్రజలు కేవలం తాము విశ్వసించాం అని పలికినంత మాత్రాన తమను వదలిపెట్టడం జరుగుతుందని భావిస్తున్నారా? తమను పరీక్షించడం జరగదని తలుస్తున్నారా? వారికి పూర్వం గతించినవారిని కూడా మేము పరీక్షించాము. (మీలో) నిజాయితీపరులెవరో, మోసగాళ్ళెవరో దేవుడు తప్పకుండా పరీక్షించ వలసిఉంది.'' (ఖుర్ఆన్-29:2,3)

విశ్వాసుల్ని దేవుడు తప్పకుండా విశ్వాసపరీక్ష పెడతాడని ఈసూక్తి తెలియజేస్తోంది. పరీక్ష ఎదురైనప్పుడే నిజమైనవిశ్వాసి ఎవరో, కపటవిశ్వాసి

ఎవరో, మాటలవిశ్వాసి ఎవరో, చేతలవిశ్వాసి ఎవరో తెలుస్తుంది.

మక్కాలో ముస్లింలకు, ఇస్లాం ఉద్యమానికి అవిశ్వాసుల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదురయింది. అవిశ్వాసులు ముస్లింలను అనేక విధాల వేధిస్తూ వారి జీవితాల్ని దుర్భరం చేశారు. ఈ పరిస్థితిని గురించి ప్రస్తావిస్తూ హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ (రజి) ఇలా అన్నారు:

మేము బహుదైవారాధకుల వేధింపులతో విసిగిపోయాం. ఓరోజు నేను దైవప్రవక్త (స)ను కాబాగోడ నీడన కూర్చొని ఉండటం చూసి, దగ్గరికెళ్ళి "దైవప్రవక్తా! మాకోసం దైవాన్ని ప్రార్థించరూ?" అని విన్నవించాను. ఈ మాట వినగానే ఆయన ముఖం కోపంతో జేవురించింది. ఆయనిలా అన్నారు: "మీకు పూర్వముండిన విశ్వాసులపై మీకంటే ఘోరమైన కష్టాలు వచ్చిపడ్డాయి. వారిలో ఒకడ్ని నేలపై గుంటత్రవ్వి అందులో కూర్చోబెట్టి తల మీద రంపం పెట్టి చీల్చివేయడం జరిగింది. మరొకడ్ని ఇస్లాం నుండి మరల్చడానికి అతని కీళ్ళలోకి ఇనుపదువ్వెనలు గుచ్చి లాగేశారు. దైవసాక్షి! ఈపని ఎట్టి పరిస్థితిలోనూ నెరవేరుతుంది. చివరికి ఒక వ్యక్తి ఒంటరిగా సనా నుండి హజ్రెమౌత్ వరకు నిర్భయంగా ప్రయాణం చేస్తాడు. అప్పుడతనికి దైవభయం తప్ప మరే భయముండదు." (బుఖారి, అబూదావూద్)

"విశ్వాసులారా! (వాస్తవం తెలిసి కూడా) మీరు దేవునికి, ఆయన ప్రవక్తకు ద్రోహం తలపెట్టకండి. మీ కప్పగించబడే బాధ్యతల విషయంలో కూడా ద్రోహబుద్ధితో వ్యవహ రించకండి. మీ సంతానం, సిరిసంపదలు మీ పాలిట పరీక్షా సాధనాలని గుర్తుంచుకోండి. మీకోసం దేవుని దగ్గర ఇంతకంటే ఎంతో గొప్పప్రతిఫలం ఉంది." (ఖుర్ఆన్-8:27,28)

"విశ్వాసులారా! మీ భార్యాపిల్లలలో కొందరు మీకు శత్రువులై ఉంటారు. వారిపట్ల అప్రమత్తంగా ఉండండి. అయితే వారిని దయార్ద్ర హృదయంతో క్షమిస్తే దేవుడు (కూడా మీపట్ల) క్షమాశీలి, దయానిధి (అవుతాడు). మీ సంతానం, సిరిసంపదలు మీకు పరీక్షగా చేయబడ్డాయి. (దీన్నుండి గట్టెక్కితే మీకు) దేవునివద్ద గొప్పప్రతిఫలం ఉంది." (ఖుర్ఆన్-64-14,15)



మనిషికి సంతానం-సిరిసంపదల పట్లే ఎక్కువవ్యామోహం ఉంటుంది. సంతానం, సిరిసంపదలే దైవమార్గంలో అవరోధాలై నిలుస్తాయి. అందుకే విశ్వాసి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఖుర్ఆన్ హెచ్చరిస్తోంది.

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "నీవొక శత్రువుని చంపి విజయం సాధించాననో లేక అతను నిన్ను చంపడం వల్ల నీకు స్వర్గప్రాప్తి కలుగుతుందనో అనుకుంటావు. కాని నీ అసలుశత్రువు అతను కాదు. నీ అసలు శత్రువు నీ కడుపున పుట్టిన పిల్లవాడు కావచ్చు. అంతకంటే పెద్ద శత్రువు నీ అధీనంలో ఉన్న నీ సిరిసంపదలే." (తబ్రాని)

"దైవాజ్ఞ లేనిదే ఏఆపదా రాదు. దేవుడ్ని విశ్వసించేవారికి దేవుడు (కష్టాలలోను, సుఖాలలోను) సద్బుద్ధి ప్రసాదిస్తాడు. దేవుడు సర్వం ఎరిగినవాడు. (కనుక) దేవునికి, ఆయన ప్రవక్తకు విధేయులయి పోండి. మీరు (మా) విధేయతకు విముఖులైపోతే, సత్యాన్ని స్పష్టంగా అందజేయడమే మాప్రవక్త బాధ్యత. అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కాబట్టి విశ్వాసులు (అలాంటి) దేవుడ్నే నమ్ముకోవాలి." (ఖుర్ఆన్-64:11-13)

దైవప్రవక్త (స) హితోక్తి: "విశ్వాసి వ్యవహారం వింతగా ఉంది. అతని విషయంలో దైవం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అతనికి మంచిదే. కష్టాలువస్తే సహిస్తాడు. ఈ సహనం అతనికి మంచివిషయమే. సౌఖ్యాలలో కృతజ్ఞత చూపుతాడు. ఈ కృతజ్ఞత కూడా అతనిపాలిట మంచివిషయమే. ఈ మహాభాగ్యం విశ్వాసికి తప్ప మరెవరికీ ప్రాప్తంకాదు." (బుఖారి, ముస్లిం)

వహీబ్ బిన్ విర్ద్ (రహ్మాలై) ఉల్లేఖించిన ఒక హదీసు ప్రకారం దేవుడిలా చెబుతున్నాడు: "నేను ఏ దాసుణ్ణయితే ప్రపంచం నుండి లేపి కరుణించ దలచుకుంటానో ఆ దాసునికి అతని పాపాలకు ఫలితంగా ప్రపంచంలో వ్యాధులు, భార్యాపిల్లల గురించిన ఆపదలు, ఆర్థిక బాధలు కలిగిస్తాను. అప్పటికీ మరికొన్ని పాపాలు మిగిలివుంటే నేనతనికి మృత్యుకాఠిన్యం కలిగిస్తాను. (అంటే కఠినంగా ప్రాణంతీస్తాను.) దాంతో ఆ దాసుడు పుట్టినప్పుడు పాపరహితుడై ఉన్నట్లు పరమ పావనుడై నా దగ్గరకు వస్తాడు.

నా గౌరవప్రపత్తుల సాక్షి! నేను ఏ దాసుణ్ణయితే ప్రపంచం నుండి లేపి శిక్షించదలచుకుంటానో ఆ దాసుడు చేసిన ప్రతి పుణ్యకార్యానికి ప్రతిఫలం నేను ప్రపంచంలోనే అతనికి ఆరోగ్యం, ఉపాథిసమృద్ధి, భోగభాగ్యాల రూపంలో ప్రసాదిస్తాను. అప్పటికీ మరికొన్ని పుణ్యకార్యాలు మిగిలివుంటే నేనతనికి మృత్యు సౌలభ్యం కలిగిస్తాను. (అంటే తేలికంగా ప్రాణం తీస్తాను.) దాంతో అతను నరకం నుండి కాపాడుకోవడానికి ఎలాంటి పుణ్యకార్యం లేనివాడై పరమపాపిష్ఠిగా నాదగ్గరకు చేరుకుంటాడు.'' (మౌత్కారుఖుట్కా)

## దుష్టశక్తుల నుండి రక్షణ

మానవుడు దుష్టశక్తుల నుండి రక్షణ పొందడానికి, ముఖ్యంగా శాపగ్రస్తుడైన షైతాన్ కీడునుండి కాపాడుకోవడానికి దేవుడతనికి ఎన్నో హెచ్చరికలు, హితోపదేశాలు చేశాడు. ఈ క్రింది ఖుర్‌ఆన్ సూక్తులు చూడండి:

"ఆదం సంతానమా! షైతాన్ మీ తల్లిదండ్రుల్ని మభ్యపెట్టి స్వర్గం నుండి తీసివేయించాడు. ఒకరి మర్మావయవాలు మరొకరి ముందు బహిర్గతం కావడానికి వారి దుస్తులు తొలగించాడు. జాగ్రత్త! ఆవిధంగా వాడు మిమ్మల్ని కూడా మాయమాటలతో మభ్యపెట్టవచ్చు. వాడు, వాడి అనుచర మూకలు మిమ్మల్ని మీరు చూడని వైపు నుండి చూస్తారు. ఈ పిశాచమూకలను మేము విశ్వసించనివారికి సహచరులుగా, సంరక్షకులుగా చేశాము. (7:27)

"వారేదైనా సిగ్గుమాలిన పని చేస్తూ, తమ తాతముత్తాతలు ఇలాగే చేస్తుండేవారని అంటారు. పైగా దేవుడే అలా చేయమని తమను ఆజ్ఞాపించాడని చెబుతారు. చెప్పు: 'నీతిబాహ్యమైన పనులు చేయమని దేవుడు ఎన్నటికీ ఆజ్ఞాపించడు. మీరు దేవుని పేరు చెప్పి మీకు తెలియని విషయాల్ని గురించి దేవుడే బోధిస్తున్నాడని అంటారా?" (7:27,28)

"మానవులారా! దేవుని వాగ్దానం సత్యమయినది. కనుక ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసగించకూడదు. ఆ మహామోసగాడు కూడా మిమ్మల్ని మోసగించకూడదు సుమా! షైతాన్ మీకు బహిరంగశత్రువు. కనుక మీరు కూడా వాడ్ని శత్రువుగానే పరిగణించండి." (35:5,6)



"మానవులారా! మీరు ప్రపంచంలో లభించే ధర్మసమ్మతమైన పరిశుద్ధ పదార్థాలే తినండి. షైతాన్ అడుగుజాడలలో నడవకండి. వాడు మీకు ఆగర్భ శత్రువు. మిమ్మల్ని వాడు దుష్టకార్యాలకు, అశ్లీలచేష్టలకు పురిగొల్పుతాడు. దేవుని విషయంలో మీకేమాత్రం తెలియని విషయాల్ని దేవునిపేర పలకమని మిమ్మల్ని పురిగొల్పుతాడు." (2:168,169)

"కొందరు జ్ఞానం లేకుండానే దేవుని విషయంలో వాదిస్తారు. వారు తలబిరుసెక్కిన ప్రతి షైతాన్‌ని అనుసరిస్తారు. వాడి తలరాతలో తనతో స్నేహం చేసిన ప్రతి మనిషినీ వాడు మార్గభ్రష్టుడిగా చేసి, నరకం దారి చూపిగాని వదలిపెట్టడని రాసిఉంది." (ఖుర్‌ఆన్-22:3,4)

"మానవులారా! పిశాచశక్తులు ఎవరిని ఆవహిస్తాయో మీకు తెలుపనా? వంచకుడు, అబద్ధాలకోరయిన ప్రతి పాపాత్ముడ్ని ఆవహిస్తాయి. వినీ వినని కొన్నిమాటలు మోసుకెళ్ళి వారి చెవులలో ఊదేయడం జరుగుతుంది. వాటిలో అనేక విషయాలు అసత్యాలే అయివుంటాయి." (26:221-223)

"ఒక వ్యక్తికి అతని దుష్కార్యాల్ని మనోహరమైనవిగా చేసి చూపడం జరుగుతుంది. అతను కూడా తన దుష్కార్యాల్ని సత్కార్యాలుగా భావిస్తాడు. అలాంటివాడికి పట్ట పగ్గాలుంటాయా?" (35:8)

"విశ్వాసులారా! షైతాన్ అడుగుజాడల్లో నడవకండి. వాడు తనను అనుసరించే వారికి (ఎల్లప్పుడూ) చెడు, అశ్లీలతలను గురించే దుర్బోధ చేస్తాడు. మీమీద దేవుని అనుగ్రహం, ఆయన కరుణాకటాక్షాలే గనక లేకపోతే మీలో ఏఒక్కడూ పరిశుద్ధుడు (పావనం) కాలేడు. అయితే దేవుడు తానుతలచిన వారిని పావనం చేస్తాడు." (24:21)

"విశ్వసించిన ప్రజలారా! ఇస్లాంలో పూర్తిగా ప్రవేశించండి. షైతాన్ అడుగుజాడల్లో నడవకండి. వాడు మీకు ఆగర్భశత్రువు. స్పష్టమైన బోధనలు అందినప్పటికీ మీరు తిరిగి తప్పటడుగులు వేస్తే మటుకు, బాగా తెలుసుకోండి! దేవుడు సర్వశక్తిమంతుడు, సర్వంతెలిసిన మహావివేకి." (2:208,209)

“పైశాచికశక్తులు తమ అనుచరుల హృదయాల్లో లేనిపోని అనుమానాలు రేకెత్తించి వారిని మీపై ఉసిగొల్పుతాయి. వారి మాటలు విని నడచుకుంటే మీరు కూడా బహుదైవారాధకులై పోతారు.” (6:121)

“దైవభీతిపరుల మదిలో ఎప్పుడైనా షైతాన్‌ప్రేరణ వల్ల ఏదైనా దురాలోచన జనిస్తే వెంటనే వారు అప్రమత్తులై పోతారు. ఆతర్వాత అనుసరించాల్సిన విధానమేమిటో వారికి తెలుస్తుంది. షైతాన్, వాడి (దుష్ట)పరివారం తమ (మానవ)సోదరుల్ని మార్గభ్రష్టత్వం వైపుకు లాగుతుంటారు. (7:200–202)

“మీరు ఖుర్‌ఆన్ పఠించడానికి ఉపక్రమించినప్పుడు (ముందుగా) శాపగ్రస్తుడైన షైతాన్ బారినుండి దేవుడ్ని శరణువేడుకోండి. విశ్వప్రభువును నమ్ముకున్న విశ్వాసులపై వాడి పాచిక పారదు. వాడ్ని సంరక్షకుడిగా చేసుకొని (వాడు ఆడించినట్లు ఆడుతూ) మిథ్యాదైవాల్ని ఆరాధించేవారిపై మాత్రమే వాడి ఆటలు సాగుతాయి.” (ఖుర్‌ఆన్–16:98–100)

“ప్రజలు మా సూక్తుల్ని గురించి కువిమర్శలుచేస్తూ అపహాస్యం చేస్తుంటే నీవు వారి దగ్గర కూర్చోకు. అక్కడ్నుంచి లేచివెళ్ళు. వారా విషయం మానేసి మరోవిషయం మాట్లాడుకునేదాకా వారి దగ్గరకు వెళ్ళకు. ఎప్పుడైనా షైతాన్ నిన్ను మరిపింపజేస్తే జ్ఞాపకంవచ్చిన వెంటనే అలాంటి దుర్మార్గుల దగ్గర్నుంచి లేచి వెళ్ళిపో. వారి (దుష్కర్మల) లెక్క గురించి దైవభీతిపరులపై ఎలాంటి బాధ్యత లేదు. అయితే తప్పుడువైఖరి విడనాడినవారికి మాత్రం హితోపదేశం తప్పనిసరిగా చేస్తుండాలి.” (ఖుర్‌ఆన్–6:68,69)

“ఒకవేళ షైతాన్ నుండి నీకేదైనా దుష్టప్రేరణ కలిగినట్లు అన్పిస్తే (వెంటనే) నీవు దేవుని శరణువేడుకో.” (ఖుర్‌ఆన్–41:36)

చెప్పు: “నేను అరుణోదయానికి ప్రభువైన దేవుని శరణుగోరుతున్నాను. ఆయన సృష్టించిన ప్రతిదాని కీడునుండి, ముసురుకొచ్చే రాత్రిచీకటి కీడు నుండి, (మంత్ర)ముడులపై ఊదేవారి కీడునుండి, అసూయపడుతున్న అసూయాపరుడి కీడునుండి నేను ఆయన శరణుగోరుతున్నాను.” (113:1–5)



చెప్పు: “మాటిమాటికి వచ్చి భ్రమలు కలిగించి కలతలు రేపేవాడి కీడు నుండి నేను మానవుల ప్రభువు, చక్రవర్తి, ఆరాధ్యదైవం (అయిన దేవుని) శరణుగోరుతున్నాను. ప్రజల హృదయాల్లో భ్రమలు కల్గించి కలతలు రేపే వాడు మానవుల్లోనూ ఉండవచ్చు; భూతాల్లోనూ ఉండవచ్చు.” (114:1–6)

‘ఆదం సంతానమా! షైతాన్‌ని ఆరాధించవద్దని, వాడు మీకు బహిరంగ శత్రువని నేను మిమ్మల్ని హెచ్చరించలేదా? నన్నే ఆరాధించాలని, అదే సన్మార్గమని ఉపదేశించలేదా? అయినా వాడు మీలో అత్యధిక మందిని దారి తప్పించాడు. మీకా(మాత్రం) జ్ఞానంలేదా?” (36:60–62)

“ప్రతి దుర్మార్గుడు (పశ్చాత్తాపంతో) చేతిని కొరుక్కుంటూ ఇలా అంటాడు: ‘అయ్యో! నేను దైవప్రవక్తతో సహకరించి సన్మార్గగామి అయివుంటే ఎంత బాగుండేది!! అయ్యయ్యో! నేను ఫలానావాడ్ని స్నేహితుడిగా చేసుకోకుండా ఉంటే బాగుండేది!! వాడి మాయదారి మాటలు విని నాదగ్గరకొచ్చిన హితోపదేశాన్ని దూరంచేసుకున్నానే! నేనెంత దౌర్భాగ్యుడ్ని!!’ షైతాన్ మానవుడ్ని అత్యవసర సమయంలోనే నట్టేట ముంచుతాడు.” (25:27–29)

“కరుణామయుని బోధ పట్ల ఏమరుపాటు వహించినవాడిపై మేము ఒక పిశాచశక్తిని రుద్దుతాం; అది అతనికి సహచరి ఐపోతుంది. అలాంటివారిని ఈ పిశాచశక్తులు సన్మార్గంలోకి రాకుండా నిరోధిస్తుంటాయి. వారు తాము చేస్తున్న పని సముచితమైనదేనని భావిస్తారు. ఈవిధంగా చివరికా వ్యక్తి మా వద్దకు చేరుకుంటాడు. అప్పుడతను తన పిశాచ సహచరునితో ‘అయ్యయ్యో! నీకూ నాకూ మధ్య తూర్పుపడమరలంత దూరముంటే బాగుండేది!! నువ్వు నాకు అతిచెడ్డ స్నేహితుడిగా దొరికావు’ అనంటాడు.” (43:36–38)

“తీర్పు ముగిసిన తరువాత షైతాన్ వారితో ఇలా అంటాడు: ‘మీకు దేవుడు చేసిన వాగ్దానాలన్నీ నిజమయ్యాయి. కాని నేను చేసిన వాగ్దానాలలో ఒక్కటీ నిజం కాలేదు. అసలు మీచేత బలవంతంగా ఏదైనా చేయించడానికి మీమీద నాకేదైనా శక్తి ఉంటేకదా! నేను మిమ్మల్ని నామార్గం వైపు పిలిచాను. అంతే, మరేమీ చేయలేదు. మీరే నా పిలుపుకు స్పందించి వచ్చారు. కనుక

మీరిప్పుడు అనవసరంగా నన్ను నిందించకండి. మిమ్మల్ని మీరే నిందించుకోండి. ఇక్కడ మీగోడు నేను ఆలకించలేను; నాగోడు మీరు ఆలకించలేరు. ఇంతకుముందు మీరు నన్ను దేవునికి సాటికల్పించారు. (నాక్కూడా దైవత్వం ఆపాదించారు. అది మీపనే గాని, నాపని కాదు.) నేను దీన్ని ఖండిస్తున్నాను. అలాంటి దుర్మార్గులకు తప్పక ఘోరమైన శిక్ష పడుతుంది." (14:22)

"షైతాన్ మానవునితో సత్యాన్ని తిరస్కరించమని అంటాడు. మానవుడు సత్యాన్ని తిరస్కరించిన తర్వాత షైతాన్ వచ్చి 'ఇక నీతో నాకేం పని లేదు; నేను సర్వలోక ప్రభువైన దేవుడంటే భయపడుతున్నాను' అంటాడు. తత్ఫలితంగా చివరికి వారిద్దరూ నరకానికి పోతారు." (ఖుర్ఆన్–59:16,17)

## పరీక్షాప్రపంచం-సంక్షిప్త వాక్యాల్లో

ప్రపంచంలో మానవుల సుఖదుఃఖాల వ్యవస్థకు అనేక కారణాలు ఉన్నాయి. వాటి పట్ల సరైన అవగాహన లేకపోతే మనిషి దైవేతర శక్తుల్ని ఆశ్రయిస్తాడు. అక్కడా సమస్యకు పరిష్కారం లభించకపోతే తన దురదృష్టాన్ని తలచుకొని క్రుంగిపోతుంటాడు. ఇక్కడ సుఖదుఃఖాలకు ప్రధాన కారణాలను సంక్షిప్తంగా పేర్కొంటున్నాను.

1. ఇహలోకంలోని కష్టనష్టాలకు, సుఖసంతోషాలకు మొట్టమొదటి కారణం దేవుడు ఇహలోకాన్ని పరీక్షాసదనంగా నిర్ణయించడమే. మానవుడు కష్టాల్లోనూ, సుఖాల్లోనూ, భయాందోళనల్లోనూ, ప్రలోభాల్లోనూ సహనం-సంయమనాలు పాటిస్తూ, ఏవిధమైన అహంకారానికి గురికాకుండా సృష్టికర్త, సర్వశక్తిమంతుడయిన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధిస్తూ, ఆయన తన ప్రవక్తల ద్వారా తెలిపిన రుజుమార్గంలోనే నడుస్తాడా లేక దైవేతర శక్తుల్ని ఆరాధిస్తూ అపమార్గం పట్టిపోతాడా అన్నదే ఈ పరీక్ష.

2. మానవులు రుజుమార్గం, దైవవిధేయతామార్గం, శాంతిమార్గమయిన సనాతనధర్మం ఇస్లాంను కాదని, అపమార్గంలో పడి చాలాదూరం కొట్టుకుపోయినప్పుడు, వారి పాపాలు హద్దుమీరినప్పుడు దేవుడు ఇహలోకంలో కూడ ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాల రూపంలో వారిని శిక్షిస్తాడు.



3. ఇహలోకం కార్యకారణప్రపంచం అయినందున మానవులు ఉద్దేశ్యపూర్వకంగానైనా, పొరపాటుగానైనా ఇక్కడి ప్రకృతి చట్టాలను ఉల్లంఘిస్తే వారు సహజంగానే కష్టనష్టాలకు గురవుతారు. అలాగే దైవచట్టాలకు వ్యతిరేకంగా స్వయంకృత చట్టాలు చేసి అమలుపరిచినా వారు నష్టపోతారు. ఉదాహరణకు- ఇస్లామీయ ఆర్థికవిధానానికి వ్యతిరేకంగా వడ్డీ-జూదాలతో కూడిన పెట్టుబడిదారీ విధానం వల్లనే ఈనాడు అగ్రరాజ్యాలతో సహా అనేక దేశాలు తీవ్రమైన ఆర్థికసంక్షోభంలో పడి సతమతమవుతున్నాయి.

4. దైవధర్మమయిన ఇస్లాంను విశ్వసించిన ముస్లింలు కూడా కష్టనష్టాలకు గురికావడానికి కారణం వారు తమ ధర్మశాస్త్రంలోని దైవాజ్ఞలను, దైవప్రవక్త (సల్లం) హితోక్తులను పూర్తిగా పాటించకపోవడమే.

5. ఇస్లాం ఆజ్ఞలను పూర్తిగా పాటిస్తున్న ముస్లింలు కూడా కష్టాలకు లోనవుతారు. వారి విశ్వాసం ఏమేరకు దృఢమైనదో పరీక్షించడానికి దేవుడు వారినిలా కష్టాలకు గురిచేస్తాడు. ఎంతో ధర్మపరాయణులుగా కన్పించే కొందరు ఆపదలో అసహనం వెళ్ళబుచ్చుకుంటారు. ధర్మసంస్థాపన కోసం వళ్ళువంచి పనిచేయరు. దైవమార్గంలో తమ స్తోమతకు తగినవిధంగా డబ్బు ఖర్చుపెట్టరు. కాని స్వర్గం ఎంత విలువైనదో చూడండి:

"దేవుడు విశ్వాసుల నుండి వారి ధనప్రాణాలు కొనుగోలుచేశాడు. వాటికి బదులుగా వారికోసం స్వర్గం సిద్ధపరచిఉంచాడు." (ఖుర్ఆన్–9:111)

ధనప్రాణాలే ప్రియమైన మనిషి స్వర్గాన్ని ఆశించడమంటే ఎడారిలో నీటిని అన్వేషించడమే. అతనికి ఇహలోకంలోనూ కష్టాలు రావచ్చు.

6. ధర్మపరాయణతతో పాటు ధర్మసంస్థాపనా కార్యకలాపాల్లో పాల్గొనే వారిక్కూడా కష్టాలు వస్తాయి. ఒక జీవనవ్యవస్థలో శ్వాస తీసుకుంటూ, దానికి భిన్నమైన మరొక జీవనవ్యవస్థ కోసం కృషి చేస్తున్నప్పుడు కష్టాలు రావడం సహజమే కదా! అందులో ఆశ్చర్యపడాల్సిన విషయం ఏముంది? అలాంటి ముస్లింలకు కష్టాలురాకపోవడమే ఆశ్చర్యకరమైన విషయం.

**(సమాప్తం)**